Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 331 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 డిసెంబర్ 2023 బుధవారం పేజీలు : 4

## కొవిడ్ కేసులు పెరుగుతున్నాయ్!

న్యూఢిల్లీ : దేశంలో కొవిడ్‌–19 కేసుల్లో స్వల్ప పెరుగుదల, కేరళలో జేఎన్.1 వేరియంట్ వెలుగుచూసిన నేపథ్యం లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 8న కేరళ రాష్ట్రంలో 79 ఏళ్ల ఓ వృద్ధురాలిలో కొవిడ్‌–19 కొత్త వేరియంట్ జేఎన్.1 బయటపడ్డ విషయం తెలిసిందే. దానికి తోడు.. ఆదివారం దేశంలో 260 కొత్త కేసులు నమోదవ్వగా.. యాక్టివ్ కేసుల సంఖ్య 1,828కి పెరిగింది. ఒక్కరోజులో కేరళలో నాలుగు, ఉత్తరప్రదేశ్‌లో ఒకటి చొప్పున కరోనా మరణాలు సంభవించాయి. దీంతో.. రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుదర్శన్ పంత్ రాష్ట్రాలకు లేఖలు రాశారు.

## విస్తరణపై అధినాయకత్వం...

# ఫుల్ ఫోకస్

## మంత్రి పదవి ఆశావహుల్లో టెన్షన్... టెన్షన్...





హైదరాబాద్ : సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని సొంతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ.. అంచనాలకు తగ్గట్లే ఇప్పుడిప్పుడే కుదుట పడుతోంది. ఇలాంటి వేళ.. మంత్రివర్గ విస్తరణపై పార్టీ అధినాయకత్వం ఫోకస్ చేసినట్లుగా చెబుతున్నారు. ఇంతకాలం అధికారం చేతిలో లేక అల్లాడిన నేతలకు.. వీలైనంత త్వరగా అధికారాల్ని కట్టబెట్టాల్సిన అవసరాన్ని గుర్తించినట్లు చెబుతున్నారు. మరో మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న వేళ.. అందరిని కలుపుకొని వెళ్లేలా చేయటం ఒక పని అయితే.. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు లోక్ సభ ఎన్నికల వేళకు రిపీట్ చేయాల్సిన కఠిన పరీక్ష ఉంది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల నాటికి ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయటంతో పాటు.. ప్రజల సానుకూలతను ఓట్ల ద్వారా అందరికి చాటి చెప్పాలన్నట్లుగా కాంగ్రెస్ అధినాయకత్వ ఆలోచనగా చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. లోక్ సభ ఎన్నికలు కాస్త వేరుగా సాగుతాయి. అసెంబ్లీలో కాంగ్రెస్ కు ఓటేసిన వారు సైతం.. లోక్ సభ వచ్చేసరికి మోడీ ఫ్యాక్టర్ బలంగా పని చేస్తుంది. ఇదే విషయం 2019 సార్వత్రిక ఎన్నికల వేళలోనూ స్పష్టమైంది. 2018లో నాటి టీఆర్ఎస్ (ఇప్పటి బీఆర్ఎస్) చక్కటి మెజార్టీతో ఎన్నికల్లో విజయం సాధించగా.. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం అందుకు భిన్నమైన ఫలితం ఎదురుకావటం తెలిసిందే. మోడీ అంశం కూడా ఒక కారణంగా చెప్పక తప్పదు. ఇలాంటి పరిస్థితుల్లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత కాంగ్రెస్ మీద ఉంది. ఎందుకంటే.. మెజార్టీకి అవసరమైన 60స్థానాలకు అదనంగా నలుగురు మాత్రమే ఉన్నారన్నది మర్చిపోకూడదు. కమ్యునిస్టులు.. మజ్లిస్ ఎమ్మెల్యేలతో కలిపితే 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. సొంత బలంతో పోలిస్తే.. అరువుగా వచ్చే బలం ఎప్పుడైనా మారే వీలుంది. ఇలాంటివేళ.. ఎన్నికల నాటికి మరింత బలోపేతం అయ్యేందుకు వీలుగా కాంగ్రెస్ పావులు కదుపుతోందని చెబుతున్నారు. ఇందులో భాగంగా మంత్రివర్గ విస్తరణతో పాటు.. నామినేటెడ్ పదవులకు సంబంధించిన నిర్ణయాల్ని వెంటవెంటనే తీసుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఇక.. కేబినెట్ విస్తరణ విషయానికి వస్తే.. పలువురు ఆశావాహులు మంత్రి పదవుల్ని ఆశిస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ నుంచి ఓడిన షబ్బీర్ అలీకి కానీ.. నాంపల్లిలో ఓడిన ఫిరోజ్ ఖాన్ లో ఒకరికి మైనార్టీ కోటాలో పదవి ఖాయమని చెబుతున్నారు. హైదరాబాద్ మహానగరంలో ఏ ఒక్క స్థానంలోనూ కాంగ్రెస్ గెలవని పరిస్థితుల్లో నగరానికి చెందిన ఒకరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని చెబుతున్నారు. ఇందులో భాగంగా మల్కాజిగిరి నుంచి పోటీ చేసి ఓడిన మైనంపల్లి హన్మంతరావు.. ముషీరాబాద్ స్థానం నుంచి పోటీ చేసిన ఓడిన అంజన్ కుమార్ యాదవ్ లో ఒకరికి మంత్రి పదవి ఖాయమంటున్నారు. అయితే.. మైనంపల్లిని లోక్ సభ ఎన్నికల బరిలోకి దించాలన్న యోచనలో ఉన్న నేపథ్యంలో అంజన్ కు ఎక్కువ అవకాశాలు ఉంటాయమంటున్నారు. ఒకవేళ.. మంత్రివర్గంలో చోటు లభిస్తే ఆయన్ను ఎమ్మెల్సీగా ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఇక.. వివేక్ బ్రదర్స్ లో ఒకరికి అవకాశం ఉంటుందని చెబుతున్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తోపాటు ఉమ్మడి రంగారెడ్డిజిల్లా నుంచి ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉంది.

మరి.. అంచనాలకు తగ్గట్లుగా మంత్రి పదవులు ఇస్తారా? లేదంటే.. ఆశ్చర్యానికి గురి చేసేలా మంత్రి పదవుల ఎంపిక ఉంటుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి బిజీ బిజీ

న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఢిల్లీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. కాసేపటి క్రితమే ఢిల్లీకి వచ్చారు. ఢిల్లీలో సీఎం రేవంత్ షెడ్యూల్ బిజీ బిజీగా ఉండనున్నారు. ఢిల్లీలో అధికార నివాసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ఢిల్లీలోని తుగ్లక్ రోడ్ నంబర్ 23లో ఉన్న అధికారిక నివాసానికి సీఎం రేవంత్‌రెడ్డి చేరుకున్నారు. తొలిసారి అధికారిక నివాసానికి సీఎం రేవంత్ వచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధికారిక నివాసం నుంచి ఖాళీ చేయడంతో ఈరోజు సీఎం రేవంత్ సందర్శించారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి ఢిల్లీలోని తుగ్లక్‌రోడ్డులో గల బంగ్లాకు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారు. మంగళ, బుధవారం ఢిల్లీలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉండనున్నారు. ఢిల్లీలో అధిష్ఠానం పెద్దలను రేవంత్‌రెడ్డి కలవనున్నారు.

**ఏఐసీసీ అగ్రనేతలతో కీలక భేటీ :** కాగా.. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణ, ఎమ్మెల్సీల ఎంపిక సహా పార్లమెంటు ఎన్నికల్లో వ్యవహరించాల్సిన అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చించనున్నారు. సోనియాగాంధీని తెలంగాణ నుంచి పోటీ చేయాలని విజ్ఞప్తి చేస్తూ పీఏసీ చేసిన తీర్మానాన్ని అధిష్ఠానానికి అందించనున్నారు. అలాగే, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, తదితర అంశాలపైనా కేంద్రంలోని ముఖ్యులను కలిసి వారితో చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అపాయింట్‌మెంట్ కోరినట్లు సమాచారం. ఢిల్లీ పర్యటన ముగించుకుని గురువారం తిరిగి హైదరాబాద్‌కు సీఎం బయలుదేరి వచ్చే అవకాశం ఉంది.

## మోడీ అంత ధైర్యం చేస్తారా....!?

హైదరాబాద్ : దేశానికి ప్రధాని అయినా ఎక్కడో ఏదో ఒక లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలవాల్సిందే. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్. అయితే ఆయన తొలిసారి లోక్ సభకు పోటీ చేసినపుడు గుజరాత్ తో పాటు ఆ రాష్ట్రం వెలుపల కూడా పోటీ చేశారు. అలా వారణాసిలో గెలిచిన ప్రధాని దానికి తన సొంత నియోజకవర్గం గా భావించి అదే ఖరారు చేసుకున్నారు. 2019 ఎన్నికల్లోనూ ఆయన వారణాసి నుంచి పోటీ చేసి బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచారు. అలా ప్రధాని యూపీకి చెందిన ఎంపీగా ఉన్నారు. దేశంలో అత్యధిక లోక్ సభ సీట్లు ఉన్నది యూపీలోనే. అలా ఆ రాష్ట్రాన్ని ప్రభావితం చేసే ఉద్దేశ్యంతో మోడీ యూపీని స్థావరంగా చేసుకున్నారు. అయితే 2024 ఎన్నికల్లో ప్రధాని దక్షిణ భారతం వైపు చూస్తున్నారు అని అంటున్నారు. ఈ రోజుకు చూస్తే సౌతిండియాలో బీజేపీకి ఏ రాష్ట్రంలోనూ అధికారం లేదు. అదే కాంగ్రెస్ కి కర్నాటక తెలంగాణా చేతిలో ఉన్నాయి. సౌత్ మొత్తం 129 ఎంపీ సీట్లు ఉన్నాయి. బీజేపీ మళ్లీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే సౌత్ చాలా ముఖ్యం. 2019లో కర్నాటక పాతిక సీట్లు ఇచ్చి బీజేపీని నిలబెట్టింది. ఆ తరువాత తెలంగాణాలో నాలుగు దక్కాయి. తమిళనాడులో ఒకటి వచ్చింది. అంటే టోటల్ గా ముప్పయి ఎంపీ సీట్లు వచ్చాయి. ఈసారి అదే నంబర్ తో ఎంపీ సీట్లు తెచ్చుకోవాలన్నది బీజేపీ ఆలోచన. అయితే కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. కాబట్టి మెజారిటీ సీట్లు ఆ పార్టీకి దక్కుతాయని అంటున్నారు. మరి అక్కడ కొరత పడిన సీట్లను ఎక్కడ భర్తీ చేసుకోవాలి అంటే తెలంగాణాయే బీజేపీకి ఆశగా ఉంది. అయితే తెలంగాణా చిన్న రాష్ట్రం. అక్కడ 17 ఎంపీ సీట్లు మాత్రమే ఉన్నాయి. పైగా అక్కడ



కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వచ్చే ఎన్నికల్లో అదే ఊపు కాంగ్రెస్ కంటిన్యూ చేతే బీజేపీకి కేంద్రంలో పోటీగా కాంగ్రెస్ మారుతుంది. దాంతో బీజేపీ కాంగ్రెస్ ని కట్టడి చేయడానికి ఒక కొత్త వ్యూహం రూపొందిసోంది. ఈసారి ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణా నుంచి పోటీ చేయడమే ఆ వ్యూహం. దాని కోసం తెలంగాణా బీజేపీ ఒక ప్రతిపాదనను ప్రధాని ముందు పెట్టిందని అంటున్నారు. తెలంగాణాలో మల్కాజ్ గిరి సీటు నుంచి లోక్ సభకు ప్రధాని నరేంద్ర మోడీ పోటీ చేయాలని బీజేపీ నేతలు కోరుతున్నారు. ఇక చూస్తే మొత్తం 17 ఎంపీ సీట్లలో కనీసంగా పది అయినా గెలవాలని బీజేపీ చూస్తోంది. దాంతో ప్రధాని మోడీ మల్కాజ్ గిరిలో పోటీ చేస్తే ఆ ప్రభావం కచ్చితంగా మొత్తం తెలంగాణా మీద పడుతుందని భావిస్తున్నారు. పైగా మల్కాజ్ గిరిని మినీ ఇండియాగా భావిస్తారు. అక్కడ దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఉంటారు. అది బీజేపీకి బాగా ఉపయోగపడుతుంది అని అంటున్నారు. ఈ నేపథ్యంలో మోడీ మల్కాజ్ గిరిలో పోటీకి ఒకే అంటారా అన్నది ఒక చర్చగా ఉంది. ప్రధాని అంతటి సాహసం చేస్తారా అన్నది కూడా అంతా ఆలోచిస్తున్న విషయం. ఎందుకంటే బీజేపీకి తెలంగాణాలో బలం ఉన్నా అది పరిమితం. పైగా ప్రధాని వంటి వారు పోటీ చేస్తే సేఫ్ జోన్ చూసుకుంటారు. మోడీని తెచ్చి పోటీకి పెడితే అక్కడ బీజేపీ గట్టిగా లేకపోతే లేనిపోని ఇబ్బందులు వస్తాయి అంటున్నారు.

అయితే శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి డబుల్ డిజిట్ తెప్పించలేకపోయిన లోకల్ లీడర్స్ ఇపుడు ప్రధాని మోడీ చరిష్మా అంటూ ఆయన మీద భారం మోపి ఆ విధంగా గెలవాలని చూస్తున్నారు అని అంటున్నారు. వ్యూహం మంచిదే కానీ బెడిసి కొడితేనే చిక్కులు అంటున్నారు. ఇక కాంగ్రెస్ గ్రౌండ్ లెవెల్ లో స్ట్రాంగ్ గా ఉంది. బీఆర్ ఎస్ కూడా సిటీలలో పటిష్టంగా ఉంది. మరి ఆ రెండు పార్టీలను కొట్టాలంటే మోడీ రావాలని బీజేపీ అంటోంది కానీ ఆ విధంగా చేయడం వల్ల ప్లస్ ఎంతవరకూ అన్నదే చూడాల్సి ఉంది.





## చొరబాటు ఘటనపై దద్దరిల్లుతున్న పార్లమెంట్

## కొనసాగుతున్న సస్పెన్షన్ల పర్వం

దిల్లీ: లోక్‌సభలో దుండగుల చొరబాటు ఘటనతో పార్లమెంట్ దద్దరిల్లుతోంది. డిసెంబరు 13 నాటి ఈ భద్రతా వైఫల్యంపై హోం మంత్రి ప్రకటన చేయాలంటూ విపక్షాలు పట్టుబడుతున్నాయి. దీంతో ప్రతిపక్షాలపై సస్పెన్షన్ల పర్వం కొనసాగుతోంది. మంగళవారం మరో 49 మంది విపక్ష ఎంపీలపై స్పీకర్ వేటు వేశారు. ఈ సమావేశాల మొత్తానికి వారిని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. సభాపతి ఆదేశాలు ధిక్కరించిన సభ్యుల సస్పెన్షన్‌కు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మూజువాణీ ఓటుతో లోక్‌సభ ఆమోదించింది. అనంతరం స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఎంపీలు సుప్రియా సూలే, ఫరూక్ అబ్దుల్లా, శశి థరూర్, కార్తి చిదంబరం, డింపుల్ యాదవ్, మనీశ్ తివారీ తదితరులు సస్పెన్షన్‌కు గురైన వారిలో ఉన్నారు.

ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. “సభలోకి ప్లకార్డులు తీసుకురావొద్దనే నిబంధన ఉంది. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో వారు (విపక్షాలనుద్దేశిస్తూ) నిరాశ చెందారు. అందుకే వారు ఇలాంటి విపరీత చర్యలకు పాల్పడుతున్నారు” అని దుయ్యబట్టారు.

**మొత్తంగా 141 మందిపై..** కాగా.. లోక్‌సభలో ఇప్పటికే గతవారం 13 మందిని, సోమవారం మరో 33 మందిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాజా సంఖ్యతో కలిపి ఇప్పటి వరకు లోక్‌సభలో 95 మందిపై వేటు పడినట్లైంది. మరోవైపు రాజ్యసభలో ఇప్పటి వరకు 46 మందిని సస్పెండ్ చేశారు. దీంతో ఈ శీతాకాల సమావేశాల్లో ఇప్పటి వరకు మొత్తం 141 మంది విపక్ష ఎంపీలపై చర్యలు తీసుకున్నట్లైంది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈ నెల 22తో ముగియనున్నాయి.

**ఉభయ సభలు వాయిదా..** విపక్షాల ఆందోళన నేపథ్యంలో మంగళవారం కూడా ఉభయ సభలు స్తంభించాయి. భద్రతా వైఫల్యం ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయడంతో పాటు తమ ఎంపీలపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. దీంతో ఉభయ సభలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. మరోవైపు, సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు అడిగిన 27 ప్రశ్నలను లోక్‌సభ ప్రశ్నల జాబితా నుంచి తొలగించారు.

# సంపాదకీయం

## ఇద్దరి బ్యాటింగే ఇంతలా ఉంటే.. పెద్దాయన ఫీల్డ్ లోకి దిగితే?

శనివారం జరిగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్ని చూసిన గులాబీ పరివారం ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అధికారపక్షాన్ని తమ నాయకులు విజయవంతంగా అడ్డుకున్నారని.. ఇద్దరు స్టార్ బ్యాట్స్ మెన్ల ధాటికి కాంగ్రెస్ నేతలు తేలిపోయారని.. పంచ్ ల మీద పంచ్ లు వేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ తో పాటు.. పార్టీ నేతలకు సైతం నోట మాట రాకుండా చేశారన్న వాదనను వినిపిస్తున్నారు. తాజాగా జరిగిన సభ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ సానుభూతి పరులు.. ఆ పార్టీ నాయకుల పోస్టులు సోషల్ మీడియా లో హైలెట్ అవుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చ పూర్తిగా అధికార.. ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధంగా మారింది. ఈ క్రమంలో అధికార పక్షం మాట్లాడేందుకు సమయం ఇవ్వటం.. వారు ఘాటు విమర్శలు చేసే వేళలో వేచి చూసే ధోరణిని అనుసరించటంతో అధికృతను ప్రదర్శించే అవకాశాన్ని ఇచ్చినట్లు అయ్యిందన్న మాట వినిపిస్తోంది. పదేళ్ళ అధికారంలో ఉన్న వేళలో.. ఏ రోజు కూడా విపక్షం నోటి నుంచి మాటలు రాకుండా ఉండేందుకు కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన విధానాల్ని రేవంత్ అనుసరించక పోవటం.. విపక్షాలు స్వేచ్ఛగా తమ వాదనల్ని వినిపించేందుకు అవకాశం.. తగిన సమయాన్ని ఇవ్వటం కూడా కాంగ్రెస్ తేలిపోవటానికి కారణమైందంటున్నారు. ఇదిలా ఉంటే.. అధికారపక్షాన్ని నిలువరించే విషయంలో తమ పార్టీ విజయవంతమైందని గులాబీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. తమ పార్టీకి చెందిన మాజీ మంత్రులు కేటీఆర్.. హరీశ్ రావులు ఇద్దరు అధికార పక్షాన్ని ముప్పతిప్పలు పెట్టారని పేర్కొన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు.. పెడుతున్న పోస్టులు పలువురిని ఆకర్షిస్తున్నాయి. ఇద్దరు స్టార్ బ్యాట్స్ మెన్లతోనే ఇలా ఉంటే.. పెద్దాయన ఫీల్డ్ లోకి దిగితే పరిస్థితి ఎలా ఉంటుంది? అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. అంతేకాదు.. టీవీలో సభను లైవ్ గా చూసిన వారికి.. ఎవరు అధికారపక్షం? ఎవరు విపక్షం? అన్న విషయం అర్థం కానట్లుగా మారిందని పేర్కొనటం గమనార్హం.

## జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అర్హులైన వారికి సకాలంలో అనుమతులు

**జిల్లాను పారిశ్రామికాభివృద్ధిలో మరింత ముందంజలో ఉండేలా చర్యలు**

**అధికారులతో సమావేశంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**



జిల్లా బ్యూరో మేడ్చల్ - మల్కాజిగిరి (గరుడ వార్త) : జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అధికారులు పూర్తి స్థాయిలో సహకరించి టీఎస్ - ఐపాస్, టీ ప్రైడ్ కింద అర్హులైన పరిశ్రమలకు ఏమాత్రం ఆలస్యం చేయకుండా అనుమతులు అందించాలని మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా టీఎస్- ఐపాస్, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ) సమావేశాన్ని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రవీందర్, అధికారులతో కలిసి జిల్లా కలెక్టరేట్లోని తన ఛాంబర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు ఎంతో అనుకూలంగా ఉందని... దీనివల్ల పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తుంటారని వారికి అన్ని రకాల అర్హతలు ఉన్నట్లయితే త్వరితగతిన అనుమతించాల్సిందిగా సూచించారు. జిల్లాలో పరిశ్రమలు, సంస్థల ఏర్పాటుకు సంబంధిత శాఖల వారు పూర్తి స్థాయిలో సహకరించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా టీఎస్- ఐపాస్, టీ ప్రైడ్ కింద అర్హులైన అభ్యర్థులకు పరిశ్రమలు, యూనిట్ల స్థాపనకు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గౌతమ్ వివరించారు. దీంతో పాటు జిల్లాలో ఉన్న పరిశ్రమ ప్రోత్సాహక కమిటీ ద్వారా జిల్లాలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా జారీ చేయాల్సిన అనుమతులలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అన్ని రకాలుగా అనుకూలంగా ఉంటే సత్వరమే అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. అలాగే టీఎస్ ఐపాస్ కింద పరిశ్రమలకు కావాల్సిన వివిధ అనుమతుల మంజురు యొక్క పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. అలాగే జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (14) ఎస్సీ పారిశ్రామికవేత్తకు రూ.38,72,528, (15) మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.46,13,992, ఇద్దరు జనరల్ పారిశ్రామికవేత్తలకు రూ.3,54,359 పెట్టుబడి రాయితీ కింద మంజూరీ చేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ సమావేశంలో వివరించారు. అలాగే జిల్లాలో ఐదు (5) పరిశ్రమలకు ముడిసరుకులు అందులో 3 -బొగ్గు, 2- అల్కహాల్ మంజూరు చేయడం జరిగింది. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రవీందర్తో పాటు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బంది ఆసుపత్రుల్లో ఖచ్చితంగా సమయపాలన పాటించాలి

**ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందించాలి**

**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**





జిల్లా బ్యూరో మేడ్చల్ - మల్కాజిగిరి (గరుడ వార్త) : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసు పత్రుల్లో వైద్యాధికారులు, సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని, ప్రజలకు సేవ చేయడంలోనే ఎంతో సంతోషం ఉంటుందన్నవాస్తవాన్ని విస్మరించోద్దని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ (డీఎం అండ్ హెచ్వో) అధికారి డాక్టర్ రఘునాథస్వామితో కలిసి వైద్యశాఖ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఆరోగ్య శాఖకు సంబంధించి పీహెచ్సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తి దవాఖాన లు, పల్లె దవాఖానాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఎలాంటి వైద్యం అందిస్తున్నారనే విషయాలను పూర్తి స్థాయిలో అడిగి తెలుసుకొన్నారు. ప్రస్తుతం ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతిరోజూ వచ్చే రోగులు ఏఏ వ్యాధుల గురించి వస్తున్నారనే వివరాలను స్పష్టంగా తెలుసుకొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోకి మంచి వైద్యం అందుతుందనే నమ్మకంతో వస్తుంటారని వారిని ఇబ్బందులకు గురి చేయకుండా సరైన వైద్యం అందించాలని ఈ విషయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారితో పాటు కింది స్థాయి అధికారులు సైతం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జిల్లాలోనిఆసుపత్రుల్లో వైద్యం సరిగ్గా అందడంలేదనే ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఉందని ఫిర్యాదులు వచ్చినట్లయితే చర్యలు తీసుకుంటామని దీనిని దృష్టిలో పెట్టుకొని అందరికీ మంచి వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. అలాగే పీహెచ్సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు బస్తీదవాఖానాలు, పల్లె దవాఖానాల్లో సరిపడా సిబ్బంది ఉన్నారా ? మందులు సరిగ్గా అందిస్తున్నారా...? సిబ్బంది కొరత ఉందా...? అనే వివరాలను కలెక్టర్ క్షుణ్ణంగా అడిగి తెలుసుకొన్నారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తన దృష్టికితీసుకు రావాలని అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసి సమస్యలు లేకుండా చూస్తామని కలెక్టర్ గౌతమ్ సమావేశంలో తెలిపారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఆసుపత్రుల్లో ఏ రోజు చేపట్టాల్సిన పనులను ఆరోజు తప్పకుండా చేయాలని అందుబాటులో అన్ని రకాల మందులు ఉంచాలని ప్రస్తుతం లేనట్లయితే వెంటనే వాటిని తెప్పించుకొనేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఏఎన్ఎమ్లు వారు అందించే సేవలతో పాటు 108, ఆశ వర్కర్లు మెరుగైన వైద్యం అందించి పేద ప్రజలకు పూర్తి స్థాయిలో మంచి వైద్యం అందించాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ ఆకాంక్షించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు బస్తీ దవాఖానాలకు సంబంధించి బాధ్యతలు తీసుకొని ప్రతిరోజూ వాటిని పర్యటించి వాటిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించుకోవాలన్నారు. అలాగే డయాగ్నస్టిక్స్ కు సంబంధించి ఉన్న కేంద్రాల గురించి కలెక్టర్ గౌతమ్ తెలుసుకొన్నారు. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నార్మల్ డెలివరీల వివరాలను అడిగి తెలుసుకొని ప్రస్తుతం జరుగుతున్న డెలివరీలకంటే మరింత ఎక్కువ జరిగేలా అధికారులు, సిబ్బంది ప్రోత్సహించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. జిల్లాలో 108 అంబులెన్స్ సంఖ్య సరిపడా ఉందా ? వాటి పనితీరు ఎలా ఉంది ? తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకొన్నారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో సిబ్బంది, డాక్టర్లు తప్పకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని అలా కాకుండా చూడాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ సూచించారు. జిల్లాలోని ఆసుప్రతుల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. అలాగే వచ్చే వారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని. ఈ సమావేశానికి అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని వైద్యాధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో మంచి సేవలందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ గౌతమ్ సమావేశంలో కోరారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి, వైద్య శాఖ అధికారులు, వైద్యులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మీ, షాదిముబారక్ పథకాన్ని అర్హులు తప్పక సద్వినియోగం చేసుకోవాలి

**మాజీ మంత్రి, ఎంఎల్ఏ చామకూర మల్లారెడ్డి అన్నారు.**

**పార్టీలకతీతంగా జిల్లా అభివృద్ధికి సహకరించాలి: జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి**



శామీర్ పెట్ (గరుడ వార్త) : కల్యాణ లక్ష్మీ, షాదిముబారక్ పథకాన్ని అరుహులఅందరు తప్పక సద్వినియోగం చేసుకోవాలిని మాజీ మంత్రి, మేడ్చల్ ఎంఎల్ఏ చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్ పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శామీర్ పేట్ మండలం, తుంకుంట మున్సిపాలిటీకి మంజూరు అయినా షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి కార్యక్రమంలో మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి పాల్గొని, లబ్దిదారులకు చేకులను పంపిణి చేసారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ముఖ్యమంత్రిగా, తెలంగాణ ప్రజలకు ఇంటికి పెద్దకొడుకు, ఒక మేనమామగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజా సంక్షేమానికి పెద్దపిట వేశారని కొనియాడారు. ఆడబిడ్డ పెళ్ళి చేయడం అంటే తెలంగాణలో అప్పులు చేయడమో, ఆస్తులు అమ్ముకోవడమో తప్ప మరో దారి లేని పరిస్థితులు ఉత్పన్నమయ్యేవని, అందుకే ప్రతి కుటుంబంలో ఆడపిల్ల పెళ్ళి భారం అనుకోకుండా ఘనంగా చేయాలనే గొప్ప సంకల్పంతో కెసిఆర్ కల్యాణ లక్ష్మీ, షాదిముబారక్ పథకాలను తీసుకు రావడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలను అందివడంలో పెద్దపిటా వేసిందని మల్లారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సత్యనారాయణ, ఎంపీపీ ఎల్లు బాయి, వైస్ ఎంపీపీ సుజాత, జడ్పిటిసి అనిత, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు కోడూరి అశోక్, సగ్గు శ్రీను, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్, వివిధ గ్రామాల వార్డ్ సబ్యులు లింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య పథకంతో ఎంతో మేలు

**ఉమ్మడి శామీర్పేట్ మండల్ ఆరోగ్య మిత్రా యూసుఫ్**

శామీర్ పెట్ (గరుడ వార్త) : ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య పథకం లేదా రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులు పొందడం వల్ల లబ్ధిదారులకు 10 లక్షల రూపాయల మేర వైద్య చికిత్సలు అందుబాటులోకి వస్తాయని ఉమ్మడి షామీర్పేట్ మండల్ ఆరోగ్య మిత్రా యూసుఫ్ తెలిపారు. మంగళవారం శామీర్పేట, పొన్నాల గ్రామాల్లో విక్సిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఉమ్మడి శామీర్పేట్ మండల్



ఆరోగ్య మిత్ర యూసుఫ్ ప్రజల్లో కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య పథకం వల్ల వనగూరే ప్రయోజనాలను గ్రామాల్లోని ప్రజలకు వివరించారు. అంతేకాకుండా మేరీ కహాని మేరీ జుభాని లో భాగంగా సంబంధిత పథకాల వల్ల ప్రయోజనాలు పొందిన లబ్ధిదారులు ఆ పథకాల ఎంత ఉపయోగపడ్డాయో అక్కడి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలమని, ఎంపీటీసీ సాయిబాబా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, ఏఎన్ఎం స్వరూప, టీ బి సూపర్ వైజర్ జైహింద్ రెడ్డి, ఆశ వర్కర్లు, అంగన్ వాడి కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విశ్వకర్మలు ఎదుర్కొనే సమస్యలు పై పరిష్కారం చూపాలి

**మంత్రి కొండా సురేఖను కలిసిన ఐక్య(విశ్వకర్మ) సంఘం నాయకులు**

శామీర్ పెట్ (గరుడ వార్త) : అటవీ శాఖ అధికారులచే విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలంటూ మంత్రి కొండ సురేఖకు రాష్ట్ర ఐక్య సంఘం నాయకులు విన్నవించుకున్నారు. మంగళవారం నగరంలోని మంత్రి కొండ సురేఖ నివాసంలో రాష్ట్ర ఐక్య సంఘం అధ్యక్షుడుఎర్రోజీ బిక్షపతి చారి, మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడు కోల్తూరు బాలకృష్ణ చారీ, మల్కాజ్గిరి మండల



అధ్యక్షుడు బంగారు మల్లేష్ చారీ, మంచోజీ విష్ణు చారీ, మహంకాళి విష్ణు చారీ తదితరులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం ఎండోమెంట్ దేవాలయాలకు ఇచ్చే దూపదీప కార్యక్రమాల తోపాటుగా, ప్రతినెల పురోహితునికి ఇచ్చే గౌరవ భృతి ఇచ్చేలా చూడాలని మంత్రిని విశ్వకర్మలు కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## మంత్రులకు విద్యార్థుల ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందజేత

మెదక్ : ఎస్ జి టి యు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అరికెల వెంకటేశంప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడానికి అలాగే ఉపాధ్యాయుల మరియు విద్య రంగ సమస్యలను ఎస్ జి టి యు రాష్ట్ర నాయకులు ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని ఎస్ జి టి యు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అరికల వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ జి టి యు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అరికల





వెంకటేశం మాట్లాడుతూ 317 జీవో ప్రకారం ఉపాధ్యాయ బాధ్యులకు మరియు 13 జిల్లాలకు చెందిన స్పౌజ్లకు ఓకే జిల్లాలో కేటాయించాలని అలాగే ప్రతి పాఠశాలలో పరిశుభ్రతకై సర్వీస్ పర్సన్ నియమించాలని ఆయన అన్నారు ప్రతి మేజర్ గ్రామపంచాయతీ కి ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేయాలని అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సంవత్సరం ఆరంభంలోనే పాఠ్యపుస్తకాలు నాణ్యమైన రెండునెల యూనిఫారంసు మరియు బూట్లను అందజేయాలని ఆయన తమ రాష్ట్ర నాయకులు అందరూ కలిసి మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ జి టి యు రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి యాదాద్రి జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశం మెదక్ జిల్లా బాధ్యులు రామకృష్ణ పాల్గొన్నారు

# మోసగాళ్ల పథకం

హైదరాబాద్: కొత్త ప్రభుత్వం కొలువుదీరిందో లేదో దళారుల దందా మొదలైంది. ప్రభుత్వ పథకాల పేరుతో సామాన్యులను బురిడీ కొట్టేస్తున్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల పేరుతో ఎక్కడికక్కడ మోసాలు చేస్తున్నారు. ఆరు గ్యారంటీల్లోని వివిధ పథకాలకు అర్హులవ్వాలంటే కచ్చితంగా ఉండాలంటూ నకిలీ గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారు. ఇవి నిజమేనని భావిస్తున్న కార్డులు తీసుకుని కొందరు ప్రభుత్వ కార్యాలయాల్లో సంప్రదిస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో మహాలక్ష్మి పేరుతో కార్డులు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌లోని గోషామహల్, నాగర్‌ర్నూల్ జిల్లా అచ్చంపేటలోనూ 'కాంగ్రెస్ గ్యారంటీ కార్డు' అంటూ నకిలీ గుర్తింపు కార్డులు జారీ చేసినట్లు ఆ పార్టీ నేతలు గుర్తించారు. ఈ తరహా మోసాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు ప్రచారాన్ని నమ్మొద్దని ప్రభుత్వ వర్గాలు, కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నా మోసాలు కొనసాగుతూనే ఉన్నాయి.

కార్డు ఒక్కటే ప్రామాణికమంటూ

కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల పేరుతో పథకాలను ప్రకటించింది. మహాలక్ష్మి ద్వారా నెలకు రూ.2,500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేద మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, కాంగ్రెస్ చేయూత తదితర పేర్లతో వీటిని అమలు చేస్తామని ప్రకటించింది. ప్రచారంలో భాగంగా కొందరి పేర్లు, ఫోన్ నెంబర్లతో పార్టీ నేతలు



వివరాలు సేకరించారు. అధికారంలోకొచ్చాక రోజుల వ్యవధిలోని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచింది. దీన్ని ఆసరాగా చేసుకుని మిగతా పథకాలు అమల్లోకి వస్తాయంటూ కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. పథకం, విధివిధానాలు, అర్హతలు ఖరారు చేయకున్నా.. ప్రభుత్వం ప్రకటన ఇవ్వకున్నా నకిలీ గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. కొన్ని నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ఇలా ఇస్తున్నట్లు షాయినాయత్‌గంజ్ పోలీసులు గుర్తించారు. రూ.50–300 వసూలు చేసి బోగస్ కార్డులిస్తున్నారు. ఈ గుర్తింపు కార్డులపై క్యూర్ కోడ్, కాంగ్రెస్ స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ బాధ్యుల చిత్రాలు, లబ్ధిదారుల పేరు, ఫోన్ నంబర్లు ఉంటున్నాయి.

ఆ దుకాణాల్లోనే ఎక్కువగా

జిరాక్సు షాపులు, కామన్ సర్వీస్ సెంటర్లు, ఆన్‌లైన్ సేవలు అందించే దుకాణాలు, మీసేవా కేంద్రంగా ఈ తరహా మోసాలు వెలుగు చూస్తున్నాయి. అచ్చంపేట, గోషామహల్‌లో మీసేవా దుకాణాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. గోషామహల్, అచ్చంపేట ఇంకొన్నిచోట్ల వివిధ ధ్రువపత్రాల అవసరమంటూ దందా చేస్తున్నారు. పథకాలకు అర్హులవ్వాలంటే కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీలు మార్చుకోవాలని, రేషన్‌కార్డుల్లో పేర్లు నమోదు చేసుకోవాలంటూ మభ్యపెడుతున్నారు.

ఇవీ జాగ్రత్తలు

ఆరు గ్యారంటీలు, ఇతర కొత్త పథకాలకు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఒకవేళ దరఖాస్తు చేసుకోవాలంటూ ఎవరైనా చెప్తే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి నిర్ధారించుకోవాలి.

పథకాల అమలుకు ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసి అర్హుల ఎంపికకు మార్గదర్శకాలు జారీ చేస్తుంది. దరఖాస్తుకు తేదీలు అధికారికంగా ప్రకటిస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక వాల్‌పోస్టర్లు, ఇతర నోటీసులు ఉంచుతుంది. పథకాలకు అర్హత పొందాలంటే ముందస్తుగా ఎలాంటి ధ్రువపత్రం తీసుకోవాల్సిన అవసరం లేదు.

## 18 నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల

జగిత్యాల : శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి ఉమ్మడి జిల్లాలోని ఎల్‌ఎండీ ఎగువ వరకుగల యాసంగి ఆయకట్టుకు ఈ నెల 18 నుంచి సాగునీటిని విడుదల చేసేందుకు హైదరాబాద్‌లో జరిగిన ఇంజినీర్ల కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. శ్రీరామసాగర్‌లోకి ఈ వానాకాలం జూన్ 1 నుంచి ఇప్పటివరకు 200.682 టీఎంసీల వరదనీరు రాగా 2.536 టీఎంసీల నీటిని వరదకాలువ నుంచి ముప్కల్ పంపుహౌస్‌ద్వారా ఎస్సారెస్పీలోకి ఎత్తిపోశారు. ప్రాజెక్టు నుంచి మొత్తం ఔట్‌ఫ్లో 142.841 టీఎంసీలుకాగా పాతనిల్వతో కలుపుకొని ప్రస్తుతం ప్రాజెక్టులో 78.342 టీఎంసీల నీరు నిలువుంది. ఈ నెల 18 నుంచి నీటివిడుదలను ప్రారంభించనుండగా వారబందీ విధానంలో 8 రోజుల ఆన్(సరఫరా), 7 రోజుల ఆఫ్(నిలిపివేత) పద్ధతిని అనుసరించనున్నారు. ఈ మేరకు ఈ నెలలో ఒక నీటితడి, జనవరి, ఫిబ్రవరి, మార్చిల్లో రెండేసి నీటితడుల చొప్పున మొత్తం 7 తడులను యాసంగి పంటలకు పారించనున్నారు. మార్చి నెలాఖరుతో నీటివిడుదల ప్రక్రియ ముగియనుంది. ఈ షెడ్యూల్‌కు అనుగుణంగా అన్నదాతలు ఆరుతడి, వరి తదితర పంటలను పండించుకోవాలని సీఈ సుధాకర్‌రెడ్డి సూచించారు. ఎస్సారెస్పీ స్టేజ్–1 పరిధిలో కాకతీయ కాలువ ద్వారా నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్(ఎల్‌ఎండీ ఎగువవరకు) నీరందనుండగా లక్ష్మీ కాలువద్వారా నిజామాబాద్, సరస్వతి కాలువ ద్వారా నిర్మల్ జిల్లాలకు నీరందించనున్నారు. అలాగే గుత్ప, ఆలీసాగర్, చౌట్పల్లి హన్మంతరెడ్డి తదితర ఎత్తిపోతల పథకాలకు, అప్పుడప్పుడు వరదకాలువకు, మిషన్ భగీరథకు, కొంతనీటిని ఎల్‌ఎండీకి కూడా విడుదల చేయనున్నారు. ఒక పంటకు 50–60 టీఎంసీల నీరు అవసరం ఉంటుంది. కాలువలకు వదిలిన నీటిని ఆయకట్టుతో పాటుగా తూములద్వారా గొలుసుకట్టు చెరువుల్లోకి తరలించనున్నారు. ఆయకట్టుకు నీరు రానుండటం, వరదకాలువలోనూ నీటిని నిల్వచేయనుండటంతో పంటలసాగు విస్తీర్ణం గరిష్ఠానికి చేరుకునే అవకాశముంది.

# గ్యాస్ రాయితీ.. అమలుపై గందరగోళం



హైదరాబాద్: గ్యాస్ రాయితీ పథకం అమలు విధివిధానాలపై నగరవాసుల్లో గందరగోళం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిబంధనలు పెట్టకపోయినా ప్రచారాన్ని నమ్ముతున్న లబ్ధిదారులు ఏజెన్సీల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీ పూర్తిచేయాలని గడువు విధించిందనే ప్రచారంతో ఏజెన్సీల ముందు జనం బారులు తీరుతున్నారు. మరికొందరు తమ ఖాతాలను మహిళల పేరున మార్చాలని కోరుతున్నారు. వివరాలు అప్‌డేట్ చేయడానికి ఇంకా సమయం ఉందని చెప్పినా వినే పరిస్థితి లేదని సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. సర్వర్ సమస్యలు తలెత్తుతున్న తరుణంలో వీరందరి 'నో యువర్ కస్టమర్' వివరాలు నమోదు చేయడం సవాల్‌గా మారింది.

యాప్‌ల ద్వారా వెసులుబాటున్నా...

వినియోగదారులు సొంతంగానే కేవైసీ అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు ఉన్నా వారికీ సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. ప్లేస్టోర్‌లో హిందుస్థాన్ పెట్రోలియం, భారత్, ఇండేన్ తదితర చమురు సంస్థల ఆండ్రాయిడ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్న కొందరు అప్‌డేట్ సమయంలో ఎర్రర్ వస్తోందని ఫిర్యాదు చేస్తున్నారు. సంస్థల అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఇవే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని మరికొందరు పోస్టు చేస్తున్నారు. డెలివరీ బాయ్‌లకే ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా అప్‌డేట్ చేసే సౌకర్యం కల్పించినా..సాంకేతిక సమస్యలు తప్పడం లేదు.

నిబంధనలపై ప్రచారం...: మహిళల పేరుమీద ఉన్న ఖాతాలకే గ్యాస్ రాయితీ పథకం వర్తిస్తుందంటూ ప్రచారం సాగుతుండటంతో అనేక మంది తమ కనెక్షన్లను భార్య పేరున మార్చాలని కోరుతున్నారని ఏజెన్సీల ప్రతినిధులు చెబుతున్నారు. గ్యాస్ సిలిండర్ కుటుంబం మొత్తం వాడుతుందని దీన్ని దృష్టిలో పెట్టుకొని మధ్యతరగతి కుటుంబాలందరికీ పథకం వర్తించేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నట్లు వెల్లడించారు.

అప్‌డేట్ ఎలా చేసుకోవాలి..

తొలుత %https://www.mylpg.in%/ వెబ్‌సైట్‌లోకి వెళ్తే మూడు గ్యాస్ కంపెనీలకు సంబంధించిన వివరాలు ప్రత్యమవుతాయి. ఏ కనెక్షన్ వాడుతున్నారో ఆ సంస్థ సిలిండర్ గుర్తును ఎంపిక చేయాలి. కేవైసీ అప్‌డేట్ అయిందా లేదా ముందు పరిశీలించుకోవాలి. ఇందుకోసం తొలుత సైనప్ ద్వారా వివరాలు నింపి రిజిస్టర్ అవ్వాలి. తర్వాత ఓటీపీ, పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయ్యి 'వ్యూ డిటెయిల్స్'ను ఎంపిక చేస్తే ఖాతాదారు పూర్తి వివరాలు కనిపిస్తాయి. అందులో కేవైసీ అప్‌డేట్ చేశారా.. లేదా అన్న విషయం స్పష్టమవుతుంది. కేవైసీ అప్‌డేట్ లేకపోతే లాగిన్ అయ్యాక 'నీడ్ కేవైసీ' ఎంపిక చేసుకోవాలి. తర్వాత కనిపించే దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నమోదు చేసి ఏజెన్సీలో ఇస్తే బయోమెట్రిక్ ద్వారా ప్రక్రియను పూర్తి చేస్తారు.

# పరి'శ్రమి'స్తేనే ప్రగతి



పరిగి : జిల్లాలో పరిశ్రమలు లేకపోవడంతో, ఉపాధికోసం యువత ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన గత ప్రభుత్వాలు పారిశ్రామికవాడల ఏర్పాటుకు చొరవ చూపినా, అనుకున్న స్థాయిలో కార్యాచరణ చేపట్టలేదు. తాజాగా ఏర్పాటైన నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలో కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతోవీటిపై దృష్టి సారిస్తారని ఆశిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న పరిగి నియోజకవర్గంలో పారిశ్రామికవాడ ఏర్పాటుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. పూడూరు మండలం తిర్మలాపూర్, పూడూరు పంచాయతీల పరిధిలో పదేళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామికవాడ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఐదో సర్వే నంబరులో ఉన్న 113 ఎకరాల పేదల భూములను ఇందుకోసం గుర్తించి వారికి పరిహారం అందించారు. హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారి కలిగి ఉండడంతో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుచేస్తే రవాణా సౌకర్యంగా ఉంటుందని భావించారు. దీంతో 2008లో అధికారులు పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ భూములను పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)కు అప్పగించింది. సమీపాన్నే జాతీయ రహదారి, అందుబాటులో మిషన్ భగీరథ ప్లాంటు, సోలార్‌పవర్ ప్లాంట్లు, పవన విద్యుత్తు వంటివి కూడా ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు దృష్టి సారిస్తే చాలు ప్రాంత అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్న ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది.

రూ.30కోట్ల వ్యయంతో

ఎంపిక చేసిన ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అప్పట్లో రూ.30 కోట్ల నిధులతో నీటి సదుపాయం, రెండు వరుసల బీటీ రోడ్లు, విద్యుదీకరణ వంటి వివిధ రకాల పనులు పూర్తి చేశారు. వేర్వేరుగా ప్లాట్లు చేసి సీరియల్ నంబర్లు వేసి ఉంచారు. మొత్తం 38 పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉందని గుర్తించారు. ప్రారంభంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ముందుకు రాకపోవటంతో చాలా కాలంగా ఈ స్థలం ఖాళీగానే కనిపించింది. ప్రస్తుతం రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడం, జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పరిశ్రమలు వస్తే ఇక్కడ వందలాది మంది నిరుద్యోగులకు తమ అర్హతలను బట్టి పెద్ద మొత్తంలో ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆదేశాలు బుట్టదాఖలుహైదరాబాద్ శివారు కాటేదాన్ ప్రాంతంలో కొనసాగుతున్న వివిధ పరిశ్రమలను రాకంచర్లకు తరలించాలని గత భారాస ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా వచ్చేందుకు వారు సుముఖత చూపడం లేదు. అప్పటి టీఎస్‌ఐఐసీ ఛైర్మన్ బాలమల్లు, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆ సంస్థ ఉన్నతాధికారులతో కలిసి పారిశ్రామికవాడను పరిశీలించారు. కాటేదాన్‌లోని ఐరన్ పరిశ్రమలను ఖాళీ చేయించి రాకంచర్లకు తరలించే విధంగా ఆరు నెలలు గడువు విధించారు. పట్టించుకోకుంటే అనుమతులు రద్దుచేసి జనరల్ కేటగిరి కింద ఇతర సంస్థలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. రెండేళ్లు దాటినా అడుగు ముందుకు పడలేదు. కాలుష్యం లేని పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యమియ్యాలని ఇదే క్రమంలో ఇప్పటివరకు రావాల్సిన కంపెనీలు రాకపోవడంతో వాటికి కేటాయించిన భూ అనుమతులను రద్దు చేసి కొత్తవారికి ఇవ్వాలని తిర్మలాపూర్ సర్పంచి కమిలీబాయి కోరుతున్నారు.

# అపార్ట్‌మెంట్లలో గాలి నాణ్యత తక్కువ



హైదరాబాద్: మెట్రో నగరాల్లోని అపార్ట్‌మెంట్లు.. భారీ నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో ఉండే జనావాసాల్లో గాలినాణ్యత తక్కువగా ఉందని, గాలిలో దుమ్ము, ధూళి కణాల సాంద్రత పెరుగుతోందని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఆచార్యులు కవితా వేమూరి, సచిన్ చౌదరి, రిషికేష్ తమ పరిశోధనలో గుర్తించారు. రెండు నెలల నుంచి వీరు పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా హైదరాబాద్‌లో భారీ నిర్మాణాలు జరుగుతున్న కొన్ని ప్రాంతాలు, మరికొన్ని అపార్ట్‌మెంట్లలో వారు గాలినాణ్యతను లెక్కించే అత్యాధునిక పరికరాలను 40 రోజులపాటు ఏర్పాటు చేసి పరిశీలించారు. బ్రిస్బేన్‌లో పర్యావరణ కాలుష్య నివారణపై గతనెలలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో వీరి పరిశోధన పత్రం ఉత్తమ బహుమతి గెల్చుకుంది.

ఇంటా.. బయటా కాలుష్యమే: పరిశోధనలో భాగంగా భారీ ప్రాజెక్టులు జరుగుతున్న ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, ఇళ్లలో నివసిస్తున్నవారితో మాట్లాడారు. పెద్దవారిలో ముక్కు, గొంతు అలర్జీలు, చిన్నపిల్లల్లో అస్తమా లక్షణాలు కనిపించాయి. దీంతో భారీ నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో వెలువడుతున్న దుమ్ము, ధూళిని సేకరించారు. ఆయా ప్రాంతాల్లో గాలినాణ్యత సరిగా లేదని 2.5 మైక్రాన్ల మందమున్న ధూళికణాలున్నాయని తెలుసుకున్నారు. ఈ ధూళికణాలు నేరుగా శ్వాసక్రియలోకి వెళ్తుండడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించారు. తలుపులు, కిటికీలు బంద్ చేయడంతో..అపార్ట్‌మెంట్లు, భారీ నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో గాలి నాణ్యతను పరిశీలించేందుకు ముగ్గురు ప్రొఫెసర్లు పగలూ, రాత్రి సెన్సర్లతో పరిశీలించారు. వీటిని విశ్లేషించగా.. భారీ నిర్మాణ ప్రాంతాల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో లేదని తేలింది. ఆశ్చర్యకరంగా అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లలో గాలి నాణ్యత తక్కువగా ఉందని ప్రొ.రిషికేష్ బోస్ తెలిపారు. ఫ్లాట్లలో ఎప్పుడూ కిటికీలు, తలుపులు మూసేయడంతో గాలి నాణ్యత తగ్గుతోందన్నారు. తమ పరిశోధన పత్రాన్ని, అధ్యయనాన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి పంపించామని వివరించారు.

# వేలిముద్రలతో తస్మాత్ జాగ్రత్త!

పెద్దపల్లి : వీరిద్దరే కాదు.. పెద్దపల్లి, రామగుండం ప్రాంతాల్లో ఈ నెల 6 నుంచి 11 వరకు దాదాపు 50 మంది ఖాతాల నుంచి నగదు మాయమైంది. రూ.5000–రూ.10,000 వరకు పోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఇవన్నీ సీఎస్‌పీ(కామన్ సర్వీస్ పాయింట్) కేంద్రాల నుంచే డ్రా అయినట్లు చూపుతున్నాయి. బాధితులు ఫిర్యాదు చేయడానికి వెళ్లినా పోలీసులు తీసుకోవడం లేదు. సైబర్ పోలీసులను ఆన్‌లైన్‌లో సంప్రదించాల్సి రావడంతో కొందరు బాధితులు ఫిర్యాదులు కూడా చేయడం లేదు. బాధితుల్లో ఎక్కువ మంది ఎస్‌బీఐ ఖాతాదారులే గమనార్హం. అన్ని సందర్భాల్లో ఖాతాదారుల చరవాణికి వచ్చిన లింక్‌లను క్లిక్ చేయకుండానే డబ్బులు పోయాయి. మరోవైపు డబ్బు డ్రా అయినపుడు ఖాతాదారుల ఫోన్‌లకు సంక్షిప్త సందేశాలు కూడా రాకపోవడంతో బ్యాంకుకు వెళ్లి చూసుకునేదాకా తెలుసుకోలేకపోయారు.

కేంద్రాలపై నియంత్రణ కరవు

జిల్లాలో లెక్కకు మించి సీఎస్‌పీ కేంద్రాలుండటంతో వాటిపై నియంత్రణ కరవైంది. కేంద్రాల ఏర్పాటుకు కనీస అర్హతలు లేకపోవడం.. పోలీసు విచారణ లేకుండానే ప్రైవేటు చెల్లింపు సంస్థల సంబంధించిన సీఎస్‌పీలకు అనుమతించడంతోనే ఇలాంటి ఆర్థిక నేరాలు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. సీఎస్‌పీ కేంద్రాల నుంచి రూ.10 వేలకు మించి డ్రా చేసే అవకాశం లేదు. గ్రామాల్లో పింఛను సొమ్మును ఎక్కువగా వీటి ద్వారానే పంపిణీ చేస్తుంటారు. జిల్లాలో ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీఎఫ్‌సీ, తెలంగాణ గ్రామీణ బ్యాంకులకు సంబంధించిన సీఎస్‌పీలు మాత్రమే నిబంధనలకు లోబడి పని చేస్తున్నాయి.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన వారే అధికం

పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల వేలిముద్రలు వేసిన వారి ఖాతాల నుంచే డబ్బులు పోవడం చర్చనీయాంశమైంది. సాధారణంగా సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఆధార్ నంబర్ల నమోదు, వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. గత నెల రోజుల వ్యవధిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇతరులకు రిజిస్ట్రేషన్లు చేసిన, తాము చేయించుకున్న వారే బాధితులుగా ఉన్నారు. ఈ డబ్బులు కూడా ప్రైవేటు చెల్లింపు సంస్థల సీఎస్‌పీ కేంద్రాల ద్వారానే పోయినట్లు తెలుస్తోంది. విచారణ చేపడుతున్నాం–ఎడ్ల మహేశ్, పెద్దపల్లి ఏసీపీ సీఎస్‌పీ కేంద్రాల నుంచి డబ్బులు పోవడంపై మాకు ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై విచారణ చేపడుతున్నాం. డబ్బులు డ్రా అయిన కేంద్రాలను గుర్తించేందుకు సైబర్ పోలీసుల సహకారం తీసుకుంటున్నాం. విచారణను వేగవంతం చేసి, నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తాం. ఖాతాదారులు కూడా తమకు తెలియకుండా జరిగే లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి. అవసరం లేని చోట ఆధార్ నంబర్లు ఇవ్వకూడదు. వేలిముద్రలు వేయకూడదు. ఫోన్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దు. మా పరిధిలోకి రావు–వెంకటేశ్, లీడ్‌బ్యాంక్ మేనేజర్‌సీఎస్‌పీ కేంద్రాల ద్వారా పలువురి డబ్బులు పోయిన విషయం మా దృష్టికి వచ్చింది. అయితే ఆ కేంద్రాలు మా పరిధిలోకి రావు. బాధితులు మమ్మల్ని సంప్రదిస్తే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించాం.

## నిబంధనలు అతిక్రమించి.. ప్లాట్లుగా విభజించి

ఎల్లారెడ్డిపేట : పల్లెలో భూ దందా పెచ్చురిల్లుతోంది. పట్టణాలకు దీటుగా భూ క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతి లేని వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. భూముల ధరలు ఆకాశాన్నంటుతుండగా ఇదే అదునుగా భావిస్తున్న కొందరు వ్యక్తులు అక్రమాలకు తెరలేపుతున్నారు. లే అవుట్ లేకుండా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి, విక్రయిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతుండగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

పెద్ద గ్రామాల్లో భూ దందా

ఎల్లారెడ్డిపేట మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా భూముల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్, దుమాల తదితర గ్రామాల్లోని భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. ప్రధానంగా వ్యాపార, వాణిజ్యాలకు కేంద్రాలుగా ఉంటున్న ఎల్లారెడ్డిపేట, రాచర్ల గొల్లపల్లి, దుమాల, రాచర్ల బొప్పాపూర్ శివారు భూములకు సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ వంటి నగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ప్లాట్లకు డిమాండ్ పెరగడంతో సామాన్యులకు అందనంత దూరంగా ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. నాలుగేళ్లలో ఎల్లారెడ్డిపేటలో ఒకటి, రాచర్ల బొప్పాపూర్‌లో ఒకటి చొప్పున కేవలం రెండే వెంచర్లకు 67 ఉత్తర్వుల ప్రకారం అనుమతి ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. సుమారు 2 వేల ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదే క్రమంలో ఎక్కడపడితే అక్కడ లే అవుట్ లేని ప్లాట్లు దర్శనమిస్తున్నాయి. అక్రమ వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. నిబంధనలను పాటించకుండా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మలిచి, విక్రయాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. లే అవుట్ లేకుండా ప్లాట్లను విక్రయిస్తుండడంతో గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది. కొన్ని గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాలు సైతం దళారులతో లోపాయికార ఒప్పందాలతో లే అవుట్ లేని ప్లాట్ల అమ్మకాలకు ఊతమిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాచర్ల గొల్లపల్లిలో అనుమతి లేని సుమారు 18 వెంచర్లు వెలసినట్లు తెలిసింది.

నిబంధనలు బేఖాతరు గ్రామాల్లో లే అవుట్ లేని పాట్ల విక్రయాలు, అక్రమ వెంచర్ల నిరోధించడంలో అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం తొలుత వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేయాలి. 33 ఫీట్ల వెడల్పుతో బీటీ రోడ్లు, సరిపడా మురికి కాల్వలు నిర్మించాల్సి ఉంటుంది. విద్యుత్తు స్తంభాలను అమర్చి, నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలి. లే అవుట్ చేసే స్థలంలో పచ్చదనం కోసం మొక్కలు నాటడంతో పాటు 10 శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీలకు బహుమతిగా ఇవ్వాలి. లే అవుట్ కోసం గ్రామ పంచాయతీలకు దరఖాస్తు చేసుకుంటే పాలకవర్గ సభ్యులు తీర్మానం చేసి, డీటీపీసీకి పంపిస్తారు. సాంకేతిక పరిశీలన అనంతరం గ్రామ పంచాయతీలు చివరిగా అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు లే అవుట్‌తో ప్లాట్లను కొనుగోలు చేసే వారి నుంచి కేవలం నిర్మాణ రుసుమును మాత్రమే గ్రామ పంచాయతీలు వసూలు చేస్తాయి. కానీ ఇవన్నీ ఎక్కడా జరగడం లేదు. లే అవుట్ లేని ప్లాట్లను కొనుగోలు చేసిన సామాన్యులకు ఇంటి నిర్మాణ కష్టాలు వెంటాడుతున్నాయి. గతంలోని లే అవుట్ లేని స్థలాలను ఇప్పుడు అధికారులు అనుమతించడం లేదు. రిజిస్ట్రేషన్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు హద్దురాళ్లు తొలగిస్తుండడంతో కొనుగోలు దారులు నష్టపోవాల్సి వస్తోంది. గుంటల విస్తీర్ణంలో..వ్యవసాయ భూముల్లో ప్లాట్లను నెలకొల్పాలంటే తొలుత వ్యవసాయేతర భూములుగా మార్చాల్సి ఉంటుంది. ప్రభుత్వానికి చెల్లించాల్సి నాలా పన్నును ఎగ్గొట్టేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. ఎకరాల విస్తీర్ణంలోని భూములను గుంటల విస్తీర్ణంలోకి మార్పిడి చేసి అమ్ముతున్నారు. ధరణి రిజిస్ట్రేషన్‌తో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలను పొందుతున్నారు. ఇలా అనేక చోట్ల వెలుస్తున్న అనధికార వెంచర్లలో లే అవుట్‌లేని ప్లాట్లు చేతులు మారుతుండగా రైతుబంధు డబ్బులను పొందుతున్నట్లు సమాచారం. కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా భారీగా వసూలు చేసి, లే అవుట్ లేని ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి.

# మహిళా సమ్మాన్.. సెల్ఫీ దిగుదాం

ఖమ్మం : తపాలా కార్యాలయాల్లో ప్రధాన మంత్రికి ధన్యవాదాలు తెలిపే సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ మహిళా సమ్మాన్ పథకంలో చేరిన మహిళ ఫొటో తీసుకోవాలి. బలవంతం ఏమీ లేదు. ఇష్టపడేవారికి మాత్రమే. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన మహిళా సమ్మాన్ పథకంపై అవగాహన కోసం ఇలాంటి ఏర్పాటు చేశారు. ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో మహిళా సమ్మాన్ ఖాతా తెరిచిన మహిళలకు ఇక్కడి స్వియ చిత్ర పాయింట్‌ను చూపిస్తున్నారు. అందులో ఆసక్తి ఉన్న వారు ఫొటో దిగేందుకు సమ్మతిస్తున్నారు.

మహిళా సమ్మాన్ మహిళలకు మాత్రమే. తన పేరుపై, ఆడ పిల్లలు, మైనర్ బాలికలైతే సంరక్షకురాలి పేరుతో ఖాతా తెరవాల్సి ఉంటుంది.




రెండేళ్ల గడువు కాలం, వెయ్యి రూపాయల నుంచి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకునే వెసులుబాటు, రెండు లక్షలతో ఖాతా తెరిచిన మహిళకు రెండేళ్ల గడువు తర్వాత రూ.2,32,044 అందజేస్తారు. ఖాతాలో చేరిన మహిళ ఓ ఏడాది తర్వాత కట్టిన మొత్తంలో 40 శాతం తీసుకోవచ్చు. వద్దనుకుంటే ఆరు నెలల తర్వాత ఉపసంహరించుకునే సదుపాయం ఉంది.

తపాలా కార్యాలయంలో లభించే దరఖాస్తు పూర్తి చేసి, ఆధార్, పాన్ కార్డులు సమర్పించి ఉమ్మడి జిల్లాలోని ఏ తపాలా కార్యాలయంలోనైనా ఖాతా తెరిచే సదుపాయం అందుబాటులో ఉంది. కొద్ది రోజుల్లోనే 300 మంది మహిళలు ఈ పథకంలో చేరారు.

# కొత్త మార్గంలో కార్గో!

వరంగల్ : కొవిడ్ నుంచి ఆర్టీసీ తన నష్టాలను పూడ్చుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగానే 2020 జూన్‌లో కార్గో పార్శిల్ సేవలను ప్రారంభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 డిపోల పరిధిలో 11 చోట్ల ఈ సేవలకు శ్రీకారం చుట్టింది. ప్రారంభించిన తొలినాళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.1.50లక్షల నుంచి రూ.1.60 లక్షలకు పైగా ప్రతిరోజూ సమకూరుతోంది. డిపో పరిధిలో ఒక మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ అధికారితో పాటు ఆర్టీసీ పొరుగు సేవల సిబ్బందిని ఈ సేవల కోసం ప్రత్యేకంగా నియమించారు. ఇటీవల కార్గోను లాజిస్టిక్‌గా మార్చిన అధికారులు దీనిని ప్రైవేటు ఏజెంట్లకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు, పరకాల, ములుగు ప్రాంతాల్లోని కార్గోలను కమీషన్ బేసిక్‌పై ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. అత్యధిక ఆదాయం వచ్చే హనుమకొండ, వరంగల్ కేంద్రాలను ఆర్టీసీ నిర్వహిస్తోంది. త్వరలోనే వీటిని కూడా ప్రైవేటు వారికి అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఏజెంట్లకు అప్పగిస్తే ఇప్పుడున్న ఆదాయానికంటే మరింత ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ



లెక్కలేస్తోంది. ఏజెంట్లకు అప్పగించడం వలన సిబ్బందిని వారే నియమించుకుంటారు. వీరిపై ఆర్టీసీకి చెందిన మార్కెటింగ్ అధికారి పర్యవేక్షణ చేస్తారు.

అధిక ఆదాయం వస్తుందనీ..

లాజిస్టిక్ కేంద్రాలను ప్రైవేటు వ్యక్తులకు 12 శాతం కమీషన్‌పై అప్పగించనున్నట్లు సమాచారం. దీనికి తోడు కేంద్రం నిర్వహణకు అద్దె చెల్లించడంతో పాటు పార్శిళ్ల ద్వారా వచ్చే ఆదాయంలోనూ ఆర్టీసీకి వాటా వస్తుందని అధికారులు చెబుతున్నారు. కరోనా సమయంలో బస్సులు సరిగా నడవలేని సమయంలో ఆర్టీసీ సిబ్బందిని కార్గో సేవలకు వినియోగించామని, ప్రస్తుతం వందశాతం బస్సులు నడుస్తుండడంతో.. తిరిగి వారి విధులనే కేటాయిస్తున్నామని పేర్కొంటున్నారు. అత్యధికంగా ఆదాయం వచ్చే కేంద్రాలను ప్రైవేటుకు అప్పగించడం సమంజసం కాదని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..- ఎం.వేణుగోపాల్, ఏటీఎం, లాజిస్టిక్ వరంగల్ రీజియన్ అధికారి

ఇప్పటికే హనుమకొండ, వరంగల్ మినహా అన్నికేంద్రాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ప్రైవేటుకు అప్పగించాం. కొవిడ్ సమయంలో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో నడపకపోవడంతో.. సిబ్బందిని కార్గో సేవలకు ఉపయోగించాం. ప్రస్తుతం బస్సులు పూర్తిస్థాయిలో నడుస్తున్నాయి. లాజిస్టిక్ కేంద్రాలు ఇతరులకు అప్పగించడం వలన కార్యాలయాలకు అద్దెతో పాటు ఇతర ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రైవేటుకు అప్పగించినా పూర్తిస్థాయిలో ఆర్టీసీ అధికారులే పర్యవేక్షిస్తారు.

# ఉద్యోగ భద్రతకు సహకారం




ఖమ్మం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఉత్తర్వు- 44 ప్రకారం దశాబ్దాల తరబడి పనిచేస్తున్న ఉద్యోగుల కల ఎట్టకేలకు నెరవేరింది. సహకార వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి వీరికి ఉద్యోగ భద్రత లేదు. సంఘాల అధ్యక్షుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని, వేతనాలను స్థిరీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు సహకార సంఘాల అధ్యక్షులకు సైతం గౌరవ వేతనాన్ని సర్కారు పెంచింది. ఖమ్మం డీసీసీబీ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో 100 సహకార సంఘాలు ఉన్నాయి.

317 మంది ఉద్యోగులకు లబ్ధి

సర్కారు తాజా నిర్ణయం వల్ల సహకార సంఘాల్లో కార్యదర్శి, స్టాఫ్ అసిస్టెంట్, సబ్‌స్టాఫ్ క్యాడర్లలో పనిచేస్తున్న 317 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. అర్హుల జాబితాను డీఎల్‌ఈసీ (డీసీసీబీ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ) నుంచి ఎస్‌ఎల్‌ఈసీ (స్టేట్ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ)కి అధికారులు పంపించారు. ఖమ్మం జిల్లాలోని ఉద్యోగులకు శుక్రవారం నుంచి ఉత్తర్వులు జారీ కానున్నాయి. బేసిక్‌పేపై 103 శాతం డీఏ, పదకొండు శాతం హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తారు. ఇది 2014 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. అంతకుముందున్న సర్వీసు పీరియడ్‌కు.. జీవో నంబరు-115 ప్రకారం 2009 మార్చి 31కి ముందు ప్రతి 18 నెలలకోసారి ఇంక్రిమెంట్ ఇస్తూ 2009 ఏప్రిల్ 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు. 2009 ఏప్రిల్ 1 నుంచి 2014 మార్చి 31 వరకు ఏటా ఒక ఇంక్రిమెంట్ చొప్పున ఇస్తూ ఉద్యోగుల బేసిక్ పేను ఫిక్స్ చేశారు. 2021-22 ఆడిట్ రిపోర్టు ఆధారంగా పెరిగిన వేతనం చెల్లిస్తారు.

అధ్యక్షులకు పెరిగిన గౌరవం

పీఏసీఎస్‌ల అధ్యక్షులకు ఇప్పటివరకు గౌరవ వేతనం నెలకు రూ.1,250 అందింది. సంఘాల టర్నోవర్ ఆధారంగా గౌరవ వేతనమివ్వాలని సర్కారు తాజాగా నిర్ణయించింది. ఖమ్మం టేకులపల్లి ఆంధ్రాబ్యాంకు కర్షక సేవాసమితి అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి ఒక్కరే అత్యధికంగా గౌరవ వేతనం రూ.15వేలు పొందనున్నారు. ఈ సంఘం టర్నోవర్ రూ.41కోట్లు.

ఖమ్మం జిల్లాలో 221 మంది ఉద్యోగులకు 205 మంది సర్వీసును క్రమబద్ధీకరించి వేతనాలను స్థిరీకరించామని డీసీఓ విజయకుమారి తెలిపారు. సర్వీసులో అంతరాయం, ఇతర కారణాల వల్ల మరో 16 మందికి వర్తింపజేయలేదన్నారు.

# ప్రగతి పత్రాలు.. ఆన్‌లైన్‌లో



ఖమ్మం : పాఠశాల విద్యార్థులకు ఎస్‌ఏ-2 పరీక్షలు పూర్తయ్యాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ఈ నెల 24తో ముగియనుంది. విద్యార్థుల ప్రశ్నపత్రాల మూల్యాంకన వివరాలు తెలిపే ప్రోగ్రెస్ కార్డుల (ప్రగతి పత్రాలు) పంపిణీ కరోనా నాటినుంచి నిలిచిపోయింది. ఈసారి ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈపాటికే నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక (ఎస్‌ఏ-1) పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, ఎస్‌ఏ-2 ఫలితాలనూ వెబ్‌సైట్‌లో నమోదు చేసేలా ఏర్పాటు చేస్తున్నారు.

గతంలో ఇలా..

2019-20 విద్యా సంవత్సరం వరకు ప్రతి విద్యార్థికి సంచిత సమగ్ర నివేదికలు అందించేవారు. అందులో విద్యార్థి వ్యక్తిగత వివరాలు, ఫొటో, మార్కులు, గ్రేడ్లు, తరగతి వారీగా ఆరోగ్య సమాచారం, వివరణాత్మక సూచనలు నమోదు చేసి దానిపై తల్లిదండ్రుల సంతకాలు తీసుకునేవారు. ప్రభుత్వం సరఫరా చేసే ఈ నివేదిక 25 పేజీలతో ఉండేవి. ఇందులో భాగమైన ప్రోగ్రెస్ కార్డులోనే విద్యార్థుల మార్కులుండేవి. పాఠశాల మారితే విద్యార్థి తన వెంట ఈ కార్డు తీసుకెళ్లి కొత్తగా చేరిన పాఠశాలలో అప్పగించేవారు. నాలుగేళ్లుగా సమగ్ర శిక్షాభియాన్ నిలిపివేయడంతో ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి నిధుల నుంచి ప్రైవేటుగా సమగ్ర నివేదిక తయారు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరకొరగా వచ్చే నిధులు నిర్వహణకే సరిపోవడం లేదని, వీటి కొనుగోలు ఆర్థిక భారంగా మారిందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పాత విధానానికి స్వస్తి పలికి విద్యార్థులకు ఇకనుంచి ఒకటే ఆన్‌లైన్ ప్రగతి పత్రాన్ని అందించనున్నారు. "ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్ ప్రగతి పత్రాలు అందించే ఏర్పాటు చేస్తున్నాం. ఈ నెల 23లోగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక పరీక్షలకు సంబంధించిన ఫలితాలు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. విద్యార్థుల వారీగా ప్రగతి పత్రాలను సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకుని సిద్ధంగా ఉంచాలి. ఈ నెల 24న తల్లిదండ్రులతో చివరి సమావేశం నిర్వహించి ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులను అందించాలి."సోమశేఖరశర్మ, డీఈవో, భద్రాద్రి

# కరవు సీమలో పాల వెల్లువ

జనగామ : జనగామలోని పాల శీతలీకరణ కేంద్రం (విజయ డెయిరీ) రికార్డు స్థాయిలో పాలను సేకరిస్తోంది. పాల సేకరణలో రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. పాడి రైతులకు ప్రోత్సాహమందిస్తూ ప్రగతిపథంలో పయనిస్తోంది.

రోజూ 25 వేల లీటర్ల సేకరణ

జనగామ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోకి జిల్లాలోని 12 మండలాలతో పాటు యాదాద్రి-భువనగిరి జిల్లా రాజపేట, సిద్ధిపేట జిల్లా మద్దూరు మండలం కూడా వస్తాయి. వీటిలో మొత్తం 250 పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. 4వేల మందికి పాడి రైతులు పాలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గతంలో వివిధ మండలాల నుంచి సేకరించిన పాలను జనగామకు తీసుకొచ్చి హైదరాబాద్‌లోని విజయ డెయిరీకి పంపించేవారు. ఈ ఏడాది నుంచి జిల్లాలోని బచ్చన్నపేట, నర్మెట్ట, సింగరాజుపల్లి, లింగాలఘనపురం, చీటూరు, కామారెడ్డిగూడెంలో మినీ బల్క్ మిల్క్ సెంటర్ యూనిట్(బీఎంసీయూ)లను నెలకొల్పి సేకరించిన పాలను అక్కడే చిల్లింగ్ చేసి నేరుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహకాలు

విజయ డెయిరీ కేంద్రాలకు పాలను విక్రయించే రైతులకు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. పశువులకు వాడే ఫోడర్ సీడ్, మినరల్ మిక్చర్, క్యాల్షియం, విజయ క్యాటిల్ ఫీడ్, డీవార్మింగ్ మందులు, టీకాలను రాయితీపై అందిస్తున్నారు. రైతుల కుటుంబాల్లో వివాహాలు జరిగితే రూ.5 వేలు కానుక పేరుతో అందిస్తున్నారు. మరణించిన రైతుల అంత్యక్రియలకు రూ.5 వేల సాయమందిస్తున్నారు. వారి పిల్లలు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే రూ.1000 ప్రోత్సాహక బహుమతిని విజయ డెయిరీ అందిస్తోంది. ముద్ర రుణాలు అందజేస్తున్నారు. రైతులు పాడి పశువులను కొనుగోలు చేసేందుకు ప్రధానమంత్రి రుణ పథకం, ముద్ర పథకాల్లో రూ.10 లక్షల చొప్పున ఎస్‌బీఐ రుణాలు మంజూరు చేయనుంది. ఈ పథకానికి ఇప్పటికే జనగామ జిల్లాలో 600 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

ప్రత్యేక కమిటీల ఏర్పాటు

గతేడాది ప్రతి మండలంలో 9 మంది చొప్పున పాడి రైతులతో కమిటీలను ఏర్పాటు చేశారు. కొత్తగా జిల్లాలో ఆరు పాల సేకరణ కేంద్రాలను సొసైటీలకు అప్పగించారు. జనగామ పాలశీతలీకరణ కేంద్రం ద్వారా సేకరిస్తున్న పాలు టెట్రా పాలకు కూడా అర్హత



పొందాయి. ఇప్పుడు జనగామ, ఇతర కేంద్రాల ద్వారా నేరుగా హైదరాబాద్‌కు పాలను రవాణా చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా 'పాలమిత్ర' యాప్‌ను రూపొందించి జనగామ, బచ్చన్నపేట కేంద్రాల్లోని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్ ద్వారా రైతులు కేంద్రాలకు పోస్తున్న పాలు, ధర, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. రానున్న రోజుల్లో జనగామలోని పాలశీతలీకరణ కేంద్రంలోనే పాల పొట్లాలు తయారు చేయాలని, మార్కెటింగ్ వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.4 కోట్లు వెచ్చించి యంత్ర పరికరాలు తీసుకురానున్నారు.

ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.. - జి.ధన్‌రాజ్, ఉపసంచాలకులు, జనగామ విజయ డెయిరీ

రానున్న రోజుల్లో రోజుకు 60 వేల లీటర్ల పాలు సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నాం. త్వరలో జనగామ కేంద్రంలో రూ.4 కోట్లతో పాల పొట్లాల తయారీని ప్రారంభించాలనుకుంటున్నాం. గ్రామాల్లో పశుగణన చేపట్టి పాల దిగుబడి పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి- జనగాం సోమిరెడ్డి, పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

జనగామ పాలశీతలీకరణ కేంద్రంలో రికార్డు స్థాయిలో పాల సేకరణ చేసేందుకు చర్యలు చేపడతాం. రైతులకు రాయితీపై దాణా అందజేస్తున్నాం. గ్రామాల్లోని పాల కేంద్రాలను తరచూ సందర్శించి రైతుల కష్ట, నష్టాలను తెలుసుకుంటున్నాం. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

# మూతపడిన యంత్రాలు.. పని లేక రెండేళ్లు!

మహబూబాబాద్ : పసుపు ధర దిన దినం పడిపోవడంతో ఉపాధి నిలిచిపోయింది. పసుపు కొమ్ములకు పాలిష్ చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్న వ్యాపారుల ఆశలు నిరాశలయ్యాయి. ఒకటి కాదు రెండు కాదు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న యంత్రాలు పని లేక తుప్పు పట్టిపోతుండటంతో తల్లడిల్లుతున్నారు. యంత్రాల కొనుగోలు చేసిన అప్పులు చెల్లించడానికి.. కరెంట్ బిల్లులు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆ భారాన్ని పూడ్చుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ పనిపై ఆధారపడిన 250 మంది కూలీలలో 200 మందికి పనుల్లేక వేరే పనులు దొరకక అవస్థలు పడుతున్నారు. పసుపు ధర తగ్గడంతో యంత్రాలు మూతపడ్డాయి. వ్యాపారులు, కూలీలు పడుతున్న ఇబ్బందులపై మానవీయ కథనం..

మొదట్లో కేసముద్రం విపణిలో పసుపు కొనుగోలు చేసిన వ్యాపారులు నిజామాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ పాలిషింగ్ చేయించి ఇతర ప్రాంతాలకు విక్రయించే వారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో రావడంతో కేసముద్రం విపణిలో విక్రయాలు పెరిగాయి. వ్యాపారులు నిజామాబాద్‌కు వెళ్లకుండా స్వయంగా ఇక్కడనే పసుపు పాలిషింగ్(డోలా) యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు, బంగ్లాదేశ్, చైనా, అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడించారు. రెండు, మూడు యంత్రాలతో కొనసాగిన పాలిషింగ్ 20 యంత్రాలకు చేరింది. ప్రస్తుతం సాగు విస్తీర్ణం తగ్గడం. వరంగల్, కేసముద్రం మార్కెట్లకు ఏడాదికి సుమారు 8 లక్షల బస్తాలు విక్రయానికి వస్తే ధర లేక లక్ష బస్తాలు కూడా రావడం లేదు.

దుబ్బ పడుతున్న యంత్రాలు..



ఒక్కో వ్యాపారి యంత్రానికి రూ.10 లక్షలు, షెడ్, గోదాం నిర్మాణానికి మరో రూ.20 నుంచి రూ.25 లక్షల చొప్పున మొత్తంగా రూ.30 నుంచి రూ.35 లక్షలు వెచ్చించి 20 పాలిషింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నారు. ఇప్పుడు పనులు లేక 15 యంత్రాలు దుబ్బపడుతున్నాయి. కొన్ని తుప్పుపట్టాయి. కరెంట్ బిల్లులు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. కొందరు ఆ బిల్లులను కూడా చెల్లించడానికి డబ్బులు లేక 63 నుంచి 75 హెచ్‌పీ సామర్థ్యంతో ఏర్పాటు చేసుకున్న నియంత్రికలను తీసుకెళ్లాలని, కరెంట్ కనెక్షన్‌ను తొలగించాలని విద్యుత్తు శాఖ అధికారులకు విన్నవించుకుంటున్నారు.

నాణ్యత లేమి..

ఒకప్పుడు కర్కుమిన్, అయిల్ శాతం వ్యాపారులు నచ్చే విధంగా ఉన్నటువంటి పసుపులో ఇప్పుడు ఆ నాణ్యత ప్రమాణాలు తగ్గాయి. ఇందుకు ముఖ్య కారణం గత 30 ఏళ్ల నుంచి ఈ ప్రాంత రైతులు పసుపు సాగును ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. మంచి నాణ్యత ఉండడంతో గుర్తింపు లభించింది. అలాంటిది రైతులు ఏటా విత్తన మార్పిడి చేయకుండా పండించిన పంటనే తిరిగి విత్తనంగా వినియోగించడం వల్ల చీడపీడల బెడద పెరిగి నాణ్యత తగ్గింది.

దుబ్బపట్టిన పాలిషింగ్(డోలా) యంత్రాన్ని చూపుతున్న ఈ వ్యాపారి కేసముద్రానికి చెందిన అనుమాండ్ల వేణుగోపాల్‌రెడ్డి. 25 ఏళ్ల నుంచి మార్కెట్లో పసుపు ఖరీదు చేస్తున్నారు. పాలిషింగ్ చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించే వారు. అంతకు ముందు కొనుగోలు చేసిన పసుపు బస్తాలు గోదాంలోనే నిల్వ ఉన్నట్లు ఆయన చెబుతున్నారు. నాణ్యమైన పంట వస్తేనే అర్డర్లు వచ్చి యంత్రాలకు పని కలుగుతుందని వాపోతున్నారు.

ఇలాంటి పరిస్థితులు వస్తాయనుకోలేదు

చిదిరాల వసంతరావు, కేసముద్రం

కేసముద్రం మార్కెట్ పరిధిలో గత 30 ఏళ్లుగా పసుపు ఖరీదు చేస్తున్నాను. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేశాం. పసుపు కొమ్ములకు మంచి డిమాండ్ ఉండేది. ప్రస్తుతం నాణ్యత లేక డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు ఖరీదు చేయడానికి ఇష్టపడడం లేదు. మార్కెట్‌కు పసుపు రాబడులు పూర్తిగా పడిపోయాయి. ఫలితంగా రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసుకున్న డోలా యంత్రాలను మూసేశాం. దీనిపై ఆధారపడిన కూలీలకు పనులు లేవు. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు.

# గోదావరి.. నువ్వొస్తేనే సిరి

వరంగల్ : పాకాల సరస్సు అన్నదాతలకు అన్నపూర్ణ వంటిది, ఒకసారి నిండితే వానాకాలంలో 30వేల ఎకరాలు, యాసంగిలో 10వేల ఎకరాలు సాగవుతుంది. ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన పాకాలకు గోదావరి జలాలను తెచ్చేందుకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి చేసి రెండేళ్ల కిందట యాసంగికి మూడు అడుగుల నీటిని అందించి రైతులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం యాసంగిలో సరస్సు కింద 23 వేల ఎకరాల్లో యాసంగి సాగైంది. ప్రస్తుతం సరస్సులో 16.7 అడుగుల నీరుంది. ఇక పాకాలకు గోదావరి జలాల నిరంతర తరలింపుతోనే పంట చేతికందుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి భరోసా ఇస్తున్నా కార్యాచరణలో ఉన్న కొన్ని లోపాలతో అన్నదాతల్లో కొంత ఆందోళన నెలకొంది. అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులను కలిసి ఆయకట్టుకు నీటిపై మాట్లాడింది.

ఇప్పటికే సగం పెట్టుబడి పెట్టాం

సారంగపాణి, రైతు, అశోక్‌నగర్

ఆయకట్టు మొత్తం సాగుకు అనుమతిచ్చారు. ఇప్పటికే ఎకరాకు 30 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాం. ఇంకా 45 రోజులు నీరు అవసరం. సంగెం కాలువకు రెండు అడుగులు నీటిమట్టం తగ్గితే ప్రవాహం తగ్గి నీరు అందదు. గోదావరి జలాలను నిరంతం తరలించాలి. నీటిమట్టం తగ్గకుండా అధికారులు శ్రద్ధ చూపాలి. లేదంటే రైతులకు అధికారులే పరిహారం చెల్లించాలి

తూములకు షట్టర్లు లేక వృథాఅచ్యుతం, రైతు, అశోక్‌నగర్పాకాల తూములకు, కాలువల బుర్రలకు తలుపులు ఉంటే నీటి వృథా తగ్గేది. ప్రస్తుతం నీరు ఎక్కువగా పాకాల వాగులోకి పోతుంది. పొలానికి నీరు పెట్టుకొని బుర్రలు బందు చేసుకునే వెసులు బాటు లేదు. సాగుకు అనుమతిచ్చిన అధికారులకు నీరందించాల్సిన బాధ్యత కూడా ఉంది.గోదావరి జలాలొస్తాయంటేనే 13 ఎకరాలు నాటేశా

సాంబయ్య, రైతు ఖానాపురంపాకాలలోకి గోదావరి జలాలు వస్తాయన్న నమ్మకంతోనే 13 ఎకరాల్లో నాటేశా. సంగెం కాలువ కింద పరిస్థితి కాస్త ఇబ్బందిగానే ఉంది. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా ఎగువ రైతులు దిగువ వారికి సహకరించాలి. రోజు నీటిని మోటార్లతో పాకాలకు తరలించాల్సిందే.

48 రోజులపాటు నిరంతరం నీరురమేష్, డీఈఈ, పాకాలఎమ్మెల్యే పెద్ది చొరవతో రామప్ప నుంచి గోదావరి జలాలను 48 రోజులు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని తరలిస్తాం. పంట ఎండిపోకుండా చూస్తాం. రోజుకు 300 క్యూసెక్కులు వస్తుంటే 290 క్యూసెక్కుల నీరు పొలాలకు ప్రవహిస్తోంది. పురాతన కాలువలు కాబట్టి కొంత ఇబ్బంది ఉంది. కొన్ని కాలువల్లో నాచు పెరిగింది. తొలగించి నీరందిస్తాం. రైతులు నీటిని సంరక్షించుకోవాలి.




దిల్లీ: కొవిడ్ జేఎన్.1 వేరియంట్ ప్రబలుతున్న నేపథ్యంలో కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి సుధాంశ్ పంత్ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఇటీవల కాలంలో కేరళలాంటి కొన్ని రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు పెరిగాయని, ఇదే సమయంలో కొత్త వేరియంట్ ప్రభావం పెరిగిందని పేర్కొన్నారు. అందువల్ల అన్ని ప్రభుత్వాలు తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాబోయే పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వైరస్ విస్తరించకుండా అడ్డుకోవడానికి తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలి. శ్వాశకోశ సంబంధ పరిశుభ్రత పాటించేలా చూడాలి. కేంద్ర ప్రభుత్వం ఇదివరకు జారీ చేసిన కొవిడ్-19 నియంత్రణ మార్గదర్శకాలను అమలు చేయాలి. జిల్లాల వారీగా ఆసుపత్రులకు వచ్చే ఐఎల్ఐ (ఇన్‌ఫ్లుయెంజా లైక్ ఇల్‌నెస్), సారి (సీవియర్ అక్యూట్ రెస్పిరేటరీ ఇల్‌నెస్) రోగులను నిరంతరం పర్యవేక్షించాలి. వారి వివరాలను ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసి కేసుల పెరుగుదలను తొలి దశలోనే పసిగట్టాలి. కొవిడ్-19 పరీక్ష మార్గదర్శకాల ప్రకారం.. అన్ని జిల్లాల్లో తగిన పరీక్షలు నిర్వహించాలి. అందులో కేంద్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన నిష్పత్తి ప్రకారం ఆర్‌టీపీసీఆర్, యాంటీజెన్ టెస్టులు నిర్వహించాలి. ఆర్‌టీపీసీఆర్ టెస్టులు అధికంగా చేపట్టి పాజిటివ్ నమూనాలను జన్యు పరిణామ విశ్లేషణ కోసం ఇన్సాకాగ్ లేబొరేటరీలకు పంపి కొత్త వేరియంట్లను సకాలంలో గుర్తించే ప్రయత్నం చేయాలి. కొవిడ్-19 నియంత్రణకు ఇదివరకటి మాదిరే సమాజ సహకారం కోరాలి. అందరూ దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకునేలా ప్రోత్సహించాలి. జేఎన్.1 వేరియంట్ సోకిన వారిలో రోగ లక్షణాలు ఎలా ఉంటాయన్నది ఇంకా పూర్తిగా తెలియదు. సాధారణంగా కొవిడ్-19 సోకినప్పుడు కనిపించే లక్షణాలే కనిపించొచ్చు. అయితే ఈ వేరియంట్ సోకినప్పుడు ప్రభావం తీవ్రంగా ఉంటుందనే సంకేతం ఏమీలేదు. దీనివల్ల ప్రజారోగ్యానికి ముప్పు పెరిగే ప్రమాదం ఉందన్న సంకేతం కూడా లేదు. ఇప్పుడున్న లేబొరేటరీల్లో ఆర్‌టీపీసీఆర్ టెస్టుల ద్వారా జేఎన్.1 వేరియంట్‌ను కనిపెట్టవచ్చు.

## భాజపా ప్రభుత్వాన్ని కూలదోయడమే 'ఇండియా కూటమి' లక్ష్యం: ప్రధాని మోదీ



దిల్లీ: దేశానికి ఉజ్వల భవిష్యత్తును అందించడమే భాజపా ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కానీ, కేంద్రంలోని తమ ప్రభుత్వాన్ని కూలదోయడాన్నే ఇండియా కూటమి లక్ష్యంగా పెట్టుకుందని ఆయన విమర్శించారు. మంగళవారం దిల్లీలో జరిగిన భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాల వ్యవహారశైలిని ఆయన తప్పుపట్టారు. "పార్లమెంటులో జరిగిన భద్రతా ఉల్లంఘనను ప్రజాస్వామ్య విలువలపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఖండించాలి. కానీ, ప్రతిపక్షాలు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. ఇలాంటి ప్రవర్తన కారణంగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో వారి సీట్ల సంఖ్య మరింత తగ్గి, భాజపా అధిక స్థానాల్లో విజయం సాధిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రతిపక్షం తీవ్ర నిరాశకు గురైంది. అందుకే పార్లమెంట్ నిర్వహణకు అడ్డుపడుతోంది. దేశానికి ఉజ్వల భవిష్యత్తు అందించాలని భాజపా లక్ష్యంగా పెట్టుకుంటే.. కేంద్ర ప్రభుత్వాన్ని కూలదోయాలని 'ఇండియా కూటమి' లక్ష్యంగా పెట్టుకుంది" అని ప్రధాని మోదీ ఎంపీలతో వ్యాఖ్యానించినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మీడియాకు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి భాజపా ఎంపీలకు ప్రధాని కీలక సూచనలు చేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, విమర్శలకు మర్యాదపూర్వకంగా స్పందించాలని, ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉంచాలని ఆయన ఎంపీలకు సూచించారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఎంపీలు సరిహద్దు గ్రామాల్లో పర్యటించాలని ప్రధాని కోరినట్లు ప్రహ్లాద్ జోషి తెలిపారు. పార్లమెంటులో భద్రతా ఉల్లంఘనపై కేంద్ర హోం మంత్రి ప్రకటన చేయాలని సోమవారం ఉభయ సభల్లో ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీంతో సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నాయనే ఆరోపణలతో లోక్‌సభలో 33 మంది, రాజ్యసభలో 45 మందిని సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఇండియా కూటమి నేతలు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో మంగళవారం భేటీ అయ్యారు.

## ఏపీ సహా ఆరు రాష్ట్రాలు అదనపు రుణాలు పొందేందుకు అవకాశం

దిల్లీ: విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసినందుకుగాను అదనంగా 0.5శాతం రుణాలు పొందేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అవకాశం కల్పించింది. విద్యుత్ సంస్కరణల్లో ప్రధానంగా 3 అంశాలను అమల్లోకి తీసుకువచ్చినందుకుగాను కేంద్ర ఈ అవకాశం కల్పించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 12 రాష్ట్రాలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోగా.. తాజాగా ఆంధ్రప్రదేశ్ సహా ఆరు రాష్ట్రాలకు అవకాశం దక్కింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు మార్కెట్ నుంచి అదనపు రుణాలు పొందేందుకు అనుమతిస్తున్నట్టు కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది. ఈ వెసులుబాటు ద్వారా 2021-22లో ఏపీ ప్రభుత్వం రూ.3,716 కోట్లు రుణం తీసుకుంది. తాజాగా కల్పించిన వెసులుబాటుతో రూ.5,858 కోట్ల రుణం తీసుకునేందుకు అవకాశం లభించింది. ఏపీతో పాటు అస్సాం, కేరళ, రాజస్థాన్, సిక్కిం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు అదనపు రుణాలు పొందేందుకు కేంద్రం అనుమతిచ్చింది. ఈమేరకు కేంద్ర ఆర్థికశాఖ



మంత్రి నిర్మలా సీతారామన్ సామాజిక మాధ్యమం (ఎక్స్) ద్వారా వివరాలు వెల్లడించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ సిఫారసుతో రాష్ట్రాలు మార్కెట్ నుంచి అదనపు రుణాలు పొందే అవకాశం కల్పిస్తున్నట్టు కేంద్రమంత్రి పేర్కొన్నారు.




## క్వీన్స్‌లాండ్‌లో భారీ వరదలు.. నీటమునిగిన విమానాశ్రయం..!

ఆస్ట్రేలియాలోని ఉత్తర క్వీన్స్‌లాండ్‌లో జాస్పర్ తుపాను కారణంగా రికార్డు స్థాయిలో వర్షాలు కురిశాయి. 1977లో నమోదైన భారీ వరదల రికార్డును ఇవి దాటేసి ఉంటాయని క్వీన్స్‌లాండ్ ప్రీమియర్ జాన్ మైల్స్ పేర్కొన్నారు.

24 గంటల వ్యవధిలో బ్లాక్ మౌంటైన్‌లో 625 మిల్లీమీటర్ల వర్షం పడినట్లు అక్కడి వాతావరణ శాఖ వెల్లడించింది. మరికొన్ని ప్రాంతాల్లో 300 మిల్లీమీటర్ల మేర వర్షం కురిసినట్లు తెలిపింది. తుపాను మొదలైన నాటి నుంచి 20 చోట్ల మీటరుకు పైగా వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. డెయిన్‌ట్రీ నదీ పరీవాహక ప్రాంతంలో మొత్తం 820మి.మీల వర్షపాతం రికార్డైంది. రానున్న 24 గంటల్లో కొన్ని చోట్ల 500మి.మీ వర్షం పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇటీవల కాలంలో ఆస్ట్రేలియాలో ఒక ప్రదేశం ఈ స్థాయి వర్షపాతం చవిచూడటం ఇదే తొలిసారి అని అధికారులు భావిస్తున్నారు. ఫలితంగా నదులు, కాల్వలు కట్టలు తెంచుకొన్నాయి. కెయిర్న్స్ ఎయిర్‌పోర్టును మూసివేశారు. ఇక్కడ కొన్ని విమానాలు రెక్కల వరకు నీట మునిగాయి.

కెయిర్న్స్ నగరంలో ఏకంగా 2 మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో అక్కడ భారీ వరదలు విరుచుకుపడ్డాయి. భారీ సంఖ్యలో ప్రజలు ఇళ్లను వీడి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. మరికొందరు అక్కడే చిక్కుకుపోయారు. వైద్యశాలలు కూడా నీట మునిగాయి. కెయిర్న్స్ నగరంలోకి మొసళ్లు కొట్టుకొచ్చాయి. ఇప్పటికే సహాయక బృందాలు రంగంలోకి దిగినట్లు అధికారులు వెల్లడించారు. నగరంలో దాదాపు 300 మందిని రక్షించారు. పోర్ట్ డగ్లస్‌కు ఉత్తరాన ఉన్న వుజాల్‌వుజాల్ నగరం పూర్తిగా నీటిలో చిక్కుకుపోయింది. దీనికి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ వరదలకు ఎంత లేదన్నా బిలియన్ డాలర్ల వరకు నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు.




## ఎర్రసముద్రంలో ఏకకాలంలో రెండు నౌకలపై దాడి..

ఎర్ర సముద్రంలో హౌతీ తిరుగుబాటుదారులు వాణిజ్య నౌకలే లక్ష్యంగా దాడులను మరింత తీవ్రం చేశారు. సోమవారం 'స్వాన్ అట్లాంటిక్' అనే వాణిజ్య నౌకపైకి యెమెన్‌లోని తమ ఆధీనంలో ఉన్న భూభాగం నుంచి ఓ డ్రోన్, యాంటీషిప్ బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించారు.

ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. సరిగ్గా స్వాన్ అట్లాంటిక్‌పై దాడి జరిగే సమయంలోనే మరో బల్క్ కార్గో షిప్ ఎం/వి క్లారాకు అత్యంత సమీపంలో భారీ పేలుడు జరిగింది. ఈ రెండు దాడుల్లో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు తమకు సమాచారం లేదని యూఎస్ సెంట్రల్ కమాండ్ చెప్పింది.

అమరోవైపు హౌతీ వర్గాలు మాత్రం ఈ నౌకలకు ఇజ్రాయెల్‌తో సంబంధాలు ఉండటంతోనే దాడి చేశామని వెల్లడించాయి. తాము చేసే కాల్స్‌కు నౌకలోని సిబ్బంది స్పందించకపోవడంతో బలప్రయోగానికి దిగినట్లు వెల్లడించాయి. కాగా.. స్వాన్ అట్లాంటిక్ నౌక నార్వేకు చెందినదిగా తెలుస్తోంది.

**ఎర్ర సముద్రంపై అమెరికా దృష్టి..** ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంపై చర్చించేందుకు అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్.. టెల్ అవీవ్‌లో ఉన్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం. దీనిపై ఆస్టిన్ స్పందిస్తూ.. ఎర్ర సముద్రంలో నౌకలపై జరుగుతున్న దాడులపై చర్చించేందుకు పశ్చిమాసియాలోని రక్షణ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. నౌకల రక్షణ కోసం తాము 'ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్'ను ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.

ఈ బహుళపక్ష భద్రతా కార్యక్రమంలో వివిధ దేశాలతో సంయుక్త సముద్ర బలగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి ఎర్ర సముద్రంలో కార్యకలాపాలు పర్యవేక్షించే 'టాస్క్ ఫోర్స్ 153' నాయకత్వం వహిస్తుందని చెప్పారు. ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న వివిధ దేశాల నౌకలపై జరుగుతున్న క్షిపణి, డ్రోన్ దాడులను ఎదుర్కొనేందుకు.. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ప్రాంతీయ శక్తులు సమష్టిగా పోరాడాలని పేర్కొన్నారు. యెమెన్ నుంచి హౌతీ తిరుగుబాటుదారులు నిర్లక్ష్యంగా చేస్తున్న దాడులు వాణిజ్యానికి, నౌకల్లోని అమాయక సిబ్బందికి, అంతర్జాతీయ చట్టాలకు ప్రమాదకరంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ప్రారంభించిన కార్యక్రమంలో బ్రిటన్, బహ్రెయిన్, కెనడా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్, నార్వే, సీషెల్స్, స్పెయిన్ భాగస్వాములు కానున్నాయి.




## భూకంపంలో 6వేలకు పైగా ఇళ్లు ధ్వంసం...

చైనా: చైనాలో భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రతతో పలు భవనాలు నేలమట్టం కాగా.. సుమారు 116 మందికిపైగా మృతి చెందారు. 400 మందికిపైగానే గాయపడినట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చైనాలోని వాయువ్య గన్సు, కింగ్‌హై ప్రావిన్స్‌ల్లో భూకంపం సంభవించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.2గా నమోదైంది. అక్కడి కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి దాటాక భూకంపం సంభవించినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. ప్రస్తుత విపత్తు నేపథ్యంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రంగంలోకి దిగారు. అధికారులను అప్రమత్తం చేశారు. రాత్రి సమయంలో ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనతో రోడ్లపై పరుగులు తీశారు. భూకంపం ధాటికి ఇప్పటి వరకు 6,381 ఇళ్లు నేలమట్టం అయినట్లు తెలుస్తోంది. చాలా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. రోడ్లు ధ్వంసమయ్యాయి. ఎల్లో రివర్‌పై వంతెన బీటలువారింది. సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. నేలకూలిన భవనాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కింగ్‌హై ప్రావిన్స్.. టిబెట్‌కు సమీపంలో ఉంటుంది. ఆ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తుంటాయి. కింగ్‌హై పక్కన ఉండే గ్జిన్జియాంగ్ ఉయ్‌గుర్‌లో మంగళవాం మరోసారి భూమి కంపించింది. భూకంపం కారణంగా ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు పూర్తిస్థాయి సహాయక చర్యలు చేపట్టాలని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారులను ఆదేశించారు. తక్షణ సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, గాయపడినవారికి తక్షణమే చికిత్స అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. భూకంపం ప్రభావంతో సంభవించే మార్పుల వల్ల పరిస్థితులు మరింత దిగజారకుండా చూడాలన్నారు.

## టీడీపీ- జనసేన కాంబినేషన్ సూపర్ డూపర్ హిట్



విశాఖపట్నం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అనుహ్య స్పందన వచ్చిందని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం యువగళం పాదయాత్రకు అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ప్రజలతో మమేకం అయ్యారని తెలిపారు. 97 నియోజకవర్గాల్లో యువగళం పాదయాత్ర జరిగిందని... అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. రేపు నెల్లిమర్ల నియోజకవర్గం పోలిపల్లిలో నవశకం పేరుతో భారీ బహిరంగ సభ జరగనుందని... సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, లోకేష్, పార్టీ సీనియర్ నేతలు హాజరవుతున్నారన్నారు. నవశకం సభ నుండే ఎన్నికల సంఖారావాన్ని పూరించబోతున్నామని తెలిపారు. 2024 జరిగే ఎన్నికల్లో టీడీపీ - జనసేన ప్రభుత్వం రాబోతుందని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి హామీలు అమలు చేయడంలో విఫలం అయ్యారన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలపై తాము చర్చకు సిద్ధమన్నారు. ఎన్నికల ముందు విశాఖకు వస్తానని సీఎం హడావిడి చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు రెడీగా ఉన్నారన్నారు. టీడీపీ - జనసేన కాంబినేషన్ సూపర్ డూపర్ హిట్ అవుతుందని.. మళ్లీ చంద్రబాబే సీఎం అవుతారని గంటా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు.

## అసత్య ప్రచారంతో శునకానందం పొందుతున్నారు: మంత్రి రోజా

తిరుమల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ రాదని ప్రచారం చేస్తున్నారని మంత్రి రోజా మండిపడ్డారు. ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడారు. తనపై అసత్య ప్రచారం చేస్తూ కొంతమంది శునకానందం పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ఏది జరిగినా ముందు వరుసలో ఉండేది తానేనని తెలిపారు. కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు. తాను జగనన్న సైనికురాలినని.. ఆయన మాటే తనకు శిరోధార్యమని తెలిపారు. పవన్, చంద్రబాబు ఎక్కడ పోటీ చేయాలో తెలియక.. రెండేసి చోట్ల సర్వే చేయించుకుంటున్నారని మంత్రి రోజా దుయ్యబట్టారు.



## తిరుమలలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 61,499 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,789. మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.14 కోట్లు ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం పేరుతో ఆలయ శుద్ధి కార్యక్రమం, సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించడం ఆనవాయితీ.. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఉదయం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించిన టిటిడి. కొత్త వస్త్రంతో స్వామివారిని పూర్తిగా కప్పి వేసి గర్భగుడిని, పూజా సామాగ్రిని సుగంధ ద్రవ్యాల లేపనంతో శుద్ధి చేశారు. తిరుమంజనం సందర్భంగా అష్టదళ పాద పద్మ ఆరాధన సేవ రద్దు. 23 న వైకుంఠ ఏకాదశి, టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ అనాదిగా వస్తున్న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాము అన్నారు.



# నిహారిక కూల్ గా గోళ్లు గిల్లుకుంటూ అలా!

మెగా ప్రిన్సెస్ నిహారిక మళ్లీ ఇండస్ట్రీలో బిజీ అవుతోన్న సంగతి తెలిసిందే. వెబ్ సిరీస్ లు..సినిమాలు అంటూ కెరీర్ ని బిజీగా మలుస్తుంది. ఈ రకమైన బిజీ నిహారికకు సెకెండ్ ఇన్నింగ్స్ అని చెప్పొచ్చు. పెళ్లికి ముందు కొన్ని సినిమాలు చేసిన నిహారిక అటుపై వివాహం తర్వాత కొన్నాళ్లు దూరంగా ఉంది. మళ్లీ ఇప్పుడు బిజీ అవుతోన్న తీరు చూస్తుంటే ఈసారి మరింత సీరియస్ గాకెరీర్ పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. మెగా ఫ్యామిలీ హీరోల మార్కెట్ కూడా ఇప్పుడిప్పుడే రెట్టింపు అవుతుంది. చరణ్..వరుణ్ తేజ్ లను పక్కనెబడితే ఆ తర్వాత స్టార్లు అయిన సాయితేజ్..వైష్ణవ్ తేజ్ లాంటి సక్సెస్ అవ్వడంతో! మెగా సంస్థలో నిర్మాతల అవసరం కూడా ఏర్పడుతుంది. చరణ్ సొంత నిర్మాణ సంస్థలో అగ్ర హీరోలతోనూ.. చిరంజీవి తోనూ



తప్ప ఇంకే హీరోతో సినిమాలు నిర్మించలేదు. కొణిదెల బ్యానర్ అనేది కేవలం కొంత మంది హీరోలకే పరిమితం చేసారు. ఈ నేపథ్యంలో సుస్మిత కొణిదెల కూడా సొంతంగా బ్యానర్ స్థాపించి తండ్రితో ఓ సినిమా నిర్మిస్తున్నారు. ఇదే తరహాలో నిహారిక కూడా నిర్మాణం రంగంలో రాణించే ఆలోచనలో ఉన్నట్లు వినిపిస్తుంది. ఇప్పటికే ఇండస్ట్రీకి బాగా పరిచయస్తురాలే. వెనుక తండ్రి సపోర్ట్ ఎలాగూ ఉంటుంది. ఇంట్లోనే హీరోలు ఉన్నారు కాబట్టి వాళ్లతో సినిమా లు చేసుకున్నా లైఫ్ కూల్ గా సాగిపోతుంది. అప్పుడప్పుడు మ్యాకప్ వేసుకుని కెమెరా ముందుకొచ్చి ఆ రకమైన ఫ్యాషన్ కూడా నిరూపించుకోవచ్చు. అంతకు మించి కావాల్సిందే ముంటుంది. ఇక సోషల్ మీడియాలో నిహారిక యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో తనని ఎలా ఆవిష్కరించుకోవాలో తెలిసిన బ్యూటీ. డిజైనర్ దుస్తుల్లో తనదైన మార్క్ వేస్తుంది. తాజాగా జీన్స్ స్కర్ట్ లో... పింక్ వర్ణం టైట్ ఫిట్ లో నిహారిక జిగేల్ అని మెరుస్తోంది. కూల్ గా గోళ్లు గిల్లుకుంటూ గోడపై లా వాలింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది.

# మాల్దీవుల్లో తాప్సీ బికినీ దుమారం

తాప్సీ పన్ను సౌత్‌కి దూరమైన కానీ, ఇక్కడ అభిమానులకు దగ్గరగానే ఉంది. సోషల్ మీడియాల్లో నిరంతరం తన అభిమానులతో సంభాషిస్తూనే ఉంది. టాలీవుడ్ కోలీవుడ్ లో ప్రేక్షకుల హృదయాలలో మనస్సులలో బలమైన ముద్ర వేసిన తాప్సీ ఉత్తరాదినా భారీ ఫాలోయింగ్ సంపాదించుకుంది. హసీన్ దిల్‌రూబా, తప్పడ్, పింక్, జుడ్వా 2, బద్లా, మన్మర్జియాన్ సహా మరెన్నో చిత్రాలలో అద్భుతమైన నటనను ప్రదర్శించింది. తాప్సీ తాజా చిత్రంలో కింగ్ ఖాన్ షారూఖ్ సరసన నటించింది. రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వం వహించిన డంకీలో కనిపించనుంది. ఈ సినిమా ట్రైలర్ ఇటీవలే విడుదలై చర్చనీయాంశమైంది. ఈ చిత్రంలో బోమన్ ఇరానీ, విక్కీ కౌశల్ తదితరులు నటిస్తున్నారు. నిజానికి ఈ ఏడాదిలో అతిపెద్ద విడుదలలలో డంకీ ఒకటి. జవాన్ -పఠాన్ వంటి చిత్రాల బ్లాక్‌బస్టర్ విజయం



తర్వాత అందరి దృష్టి ఇప్పుడు సూపర్ స్టార్ షారూఖ్ నటించిన మూడవ చిత్రంపై ఉంది. అపజయమెరుగని హిరాణీ ఖాన్‌కి మరో బ్లాక్ బస్టర్ అందిస్తాడని అంతా భావిస్తున్నారు. ఈ సినిమా గురించి చెప్పాలంటే ప్రమోషన్లు అంతంత మాత్రమే. సౌత్ లో భారీగా రిలీజ్ కి వచ్చే ఛాన్స్ లేదని కూడా తెలుస్తోంది. టీజర్, ట్రైలర్, రెండు పాటలను మేకర్స్ ఇప్పటికే విడుదల చేశారు. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ -జియో స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా నిర్మించాయి. 21 డిసెంబర్ 2023న ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లలో విడుదల కానుంది. చాలా తక్కువ సమయంలో సినిమాని పూర్తి చేసి రిలీజ్ చేస్తున్న ఘనత హిరాణీకి దక్కుతుంది. ఇటీవల తాప్సీ పన్ను తీరిక సమయంలో వెకేషన్ కి వెళ్లింది. తాప్సీ పన్ను తన సోషల్ మీడియా ఖాతాలో తాజాగా మాల్దీవులలో తన విహారయాత్ర ఫోటోలను పోస్ట్ చేసింది. ఈ ఫోటోలలో తాప్సీ ఎంతో రిలాక్స్ డ్ గా తన సమయాన్ని ఆస్వాధిస్తోంది. బీచ్ పరిసరంలో ఇలా నెట్ లో చిక్కిన చేపపిల్లలా కూల్ గా కనిపించింది. రెడ్ షార్ట్ .. లవ్ సింబల్ ఉన్న షర్ట్ ని ధరించి స్పెషల్ గా కనిపించిన తాప్సీ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. ఓ ఫోటోగ్రాఫ్ లో తాప్సీ తన స్నేహితురాలితో కలిసి బికినీలో చెలరేగిన వైనం బయటపడింది.




# నా సామి రంగా టీజర్... పక్కా సంక్రాంతి మాస్




కింగ్ నాగార్జునకి సరైన కథ పడితే తనలోని పెర్ఫార్మెన్స్ తన్నుకుంటూ బయటకి వచ్చేస్తది అనే సంగతి అందరికి తెలిసిందే. సోగ్గాడే చిన్ని నాయనా సినిమాలో అల్లరి రొమాన్స్ లో ఇరగదీసిన కింగ్ తరువాత ఆ స్థాయిలో పెర్ఫార్మెన్స్ ఈ మధ్యకాలంలో చూపించలేదు. అవుట్ అండ్ అవుట్ మాస్ క్యారెక్టర్ పడితే నాగార్జున ఫ్యాన్స్ కి పూనకాలు తెప్పించేస్తాడని మరోసారి నా సామి రంగా హడావుడి ద్వారా హైలెట్ అవుతోంది. విజయ్ బిన్నీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ సంక్రాతి బరిలో రిలీజ్ కావడానికి సిద్ధం అవుతోంది. కింగ్ నాగార్జున కెరియర్ ఫుల్ మాస్ కమర్షియల్ ఎలిమెంట్స్ తో చాలా రోజుల తర్వాత ఈ సినిమా రాబోతోంది. తాజాగా మూవీ టీజర్ ని వదిలారు. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ నాగార్జునకి జోడీగా నటిస్తోంది. వారిద్దరి మధ్య క్యూట్ రొమాంటిక్ లవ్ స్టోరీని టీజర్ లో చూపిస్తూ దానిని డిఫరెంట్ యాంగిల్ లో ప్రెజెంట్ చేశారు. ఓ సారి నాగార్జున నరేష్, రాజ్ తరుణ్ కి తమ స్టోరీ నేరేట్ చేస్తే మరో సారి హీరోయిన్ ఆషికా రంగనాథ్ ఇద్దరితో మాట్లాడుతూ నాగార్జున గురించి అడుగుతున్నట్లు చూపించారు. హీరోయిన్ క్యారెక్టర్ కూడా పక్కా మాసివ్ గా ఆవిష్కరించారు. అదే సమయంలో మాస్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ ఎలిమెంట్స్ ని కూడా పెర్ఫెక్ట్ గా రిప్రజెంట్ చేసి టీజర్ ని ఫుల్ ప్యాక్ తో డిజైన్ చేశారు. టీజర్ అయితే మూవీ మీద అంచనాలు పెంచే విధంగానే ఉంది. అలాగే సినిమాలోని డైలాగ్స్ మరీ హై రేంజ్ లో లేవు కానీ చూస్తుంటే లోకల్ మాస్ ను చాలా నటుగా ప్రజెంట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇక స్టోరీ స్క్రీన్ ప్రెజెన్స్ పర్ఫెక్ట్ గా ఉంటే మ్యాజిక్ రిపీట్ అయ్యే అవకాశం ఉంటుంది. గతంలో సంక్రాంతి సెంటిమెంట్ గా వచ్చిన సోగ్గాడే చిన్న నాయన, బంగార్రాజు బాగా హైలెట్ అయ్యాయి. మరి సినిమా ఆ రేంజ్ లో క్లిక్ అవుతుందో లేదో చూడాలి. అల్లరి నరేష్ మాస్ లుక్ లో కనిపిస్తుండగా మరోవైపు రాజ్ తరుణ్ ఈ చిత్రంలో డీసెంట్ రోల్ లో కనిపిస్తున్నాడు. ఎంఎం కీరవాణి ఈ సినిమాకి సంగీతం అందిస్తూ ఉండగా శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మించారు. ప్రసన్న కుమార్ బెజవాడ స్టోరీ, డైలాగ్స్ అందించారు. నాగార్జున నుంచి ఫ్యాన్స్ ఎలాంటి కథని ఎక్స్ పెక్ట్ చేస్తున్నారో అలాంటి స్టోరీలైన్ తో నా సామి రంగా మూవీ సంక్రాతి కానుకగా వస్తోంది. మరి ఈ సినిమా కింగ్ కి ఎలాంటి హిట్ ఇస్తుందనేది వేచి చూడాలి.


# మన హీరోయిన్ల మనసంతా అక్కడే..



సౌత్ సినీ ఇండస్ట్రీలో అగ్ర హీరోల సరసన నటించి భారీ గుర్తింపు తెచ్చుకున్న కొందరు హీరోయిన్లు ఇప్పుడు నార్త్ పై కన్నేశారు. వాళ్లలో నయనతార, రష్మిక మందన, పూజా హెగ్డే, సాయి పల్లవి, కీర్తి సురేష్ లాంటి హీరోయిన్స్ ఇన్నేళ్లు సౌత్ లో సత్తా చాటిన ఈ హీరోయిన్స్ ఇప్పుడిప్పుడే బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటికే సౌత్ లో లేడీస్ సూపర్ స్టార్ గా పేరొందిన నయనతార షారుక్ ఖాన్ సరసన జవాన్ సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా ఎంత పెద్ద సక్సెస్ అయ్యిందో అందరికి తెలిసిందే. నయన్ తర్వాత రష్మిక మందన్న కూడా బాలీవుడ్ లో కొన్ని సినిమాలు చేసి సరైన సక్సెస్ అందుకోలేకపోయింది. ఇక ఎట్టకేలకు యానిమల్ మూవీతో రష్మిక కూడా బాలీవుడ్ లో భారీ సక్సెస్ అందుకుంది. ఇక వీరి బాటలోనే కీర్తి సురేష్ బాలీవుడ్ లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఓ వెబ్ సిరీస్ తో పాటు బాలీవుడ్ లో మరో సినిమాకి కమిట్ అయింది కీర్తి సురేష్. ఈ రెండు కూడా ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్నాయి. మరి కీర్తి సురేష్ అక్కడ ఎలాంటి సక్సెస్ అందుకుంటుందో చూడాలి. కీర్తి సురేష్ తర్వాత సౌత్ న్యాచురల్ బ్యూటీ సాయిపల్లవి కూడా బాలీవుడ్ ఇండస్ట్రీ పైనే ఆసక్తి చూపుతోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో రణ్ బీర్ కపూర్ తో కలిసి రామాయణం ప్రాజెక్టులో నటిస్తుంది. వచ్చే ఏడాది మార్చ్ నుంచి ఈ ప్రాజెక్టు సెట్స్ పైకి వెళ్ళింది. ఇక సౌత్ ఇండస్ట్రీని ఏదైనా స్టార్ హీరోయిన్ పూజ హెగ్డే కి ప్రజెంట్ టాలీవుడ్ లో అవకాశాలు లేవు. దీంతో ఆమె ఎక్కువగా బాలీవుడ్ పైనే ఇంట్రెస్ట్ చూపిస్తోంది. ఇప్పటికే బాలీవుడ్లో పలు సినిమాలు చేసిన అవి పెద్దగా సక్సెస్ అందుకోలేకపోయాయి. ప్రస్తుతం షాహిద్ కపూర్ సరసన దేవా అనే మూవీలో నటిస్తోంది. మరి సౌత్ లో సక్సెస్ అందుకున్న ఈ హీరోయిన్స్ అందరూ నార్త్ లో కూడా సక్సెస్ అందుకుంటారేమో చూడాలి. కాగా నయనతార, రష్మిక, సాయి పల్లవి లాంటి హీరోయిన్లు బాలీవుడ్ ప్రాజెక్ట్స్ చేస్తూనే మరోవైపు సౌత్ సినిమాల్లో నటిస్తున్నారు. నయనతార ఇప్పటికే తమిళంలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తుంది. రష్మిక మందన పుష్ప 2 మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. సాయి పల్లవి కూడా తమిళంలో రెండు సినిమాలు చేస్తోంది. రీసెంట్గా టాలీవుడ్ లో రామ్ చరణ్ బుచ్చిబాబు సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే మేకర్స్ నుండి దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ రావాల్సి ఉంది.

# మాస్ మహారాజా కోసం 'క్లాస్ మహారాణి'

రాబోవు ఎన్నికలలోపు ఉస్తాద్ భగత్ సింగ్‌ని పూర్తి చేయాలని దర్శకుడు హరీష్ శంకర్ ప్లాన్ చేసారు. కానీ అనుకున్నది జరగలేదు. కథానాయకుడు పవన్ కళ్యాణ్ అందుబాటులో లేకపోవడంతో సినిమా ఆలస్యమైంది. 'ఉస్తాద్ భగత్‌సింగ్' తర్వాత రవితేజ ప్రాజెక్ట్‌కి హరీష్ శంకర్ షిఫ్టయ్యాడు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్, కాస్టింగ్ ఎంపికలు వేగంగా పూర్తవుతున్నాయి. తాజాగా రవితేజ సరసన కథానాయికను ఫైనల్ చేస్తూ అధికారిక ప్రకటన చేసారు. రవితేజ - హరీష్ శంకర్ సినిమా కోసం భాగ్యశ్రీ బోర్స్ కథానాయికగా ఎంపికైంది. భాగ్యశ్రీ బోర్సే పోస్టర్ ని రిలీజ్ చేసారు.




హీరోయిన్‌ని పరిచయం చేస్తూ మాస్ మహారాజా రవితేజకు 'క్లాస్ మహారాణి' అంటూ హరీష్ తనదైన మార్క్ చతురతను ప్రదర్శించాడు. భాగ్యశ్రీ పేరుకు తగ్గట్టే చీరలో అందంగా కవ్విస్తోంది. ఎంతో స్పెషల్ గా ఉన్న ఈ భామ మాస్ రాజాకు పెద్ద ప్లస్ కానుందనడంలో సందేహం లేదు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. రవితేజ నటించిన గత చిత్రం టైగర్ నాగేశ్వరరావు ఆశించిన స్థాయి విజయం సాధించలేదు. ఇక అతడు నటిస్తున్న ఇటీవలి చిత్రాల్లో కొత్త కథానాయికలను పరిచయం చేస్తున్నాడు. కొత్త ట్యాలెంటును ప్రభావవంతంగా సద్వినియోగం చేయడంలో రాజా ఎప్పుడూ ముందుంటారు! తదుపరి చిత్రంలో భాగ్యశ్రీ బోర్స్ ని ఈ అవకాశం వరించింది.

# బులుగు ఫ్రాక్‌లో టోన్డ్ లెగ్స్‌తో ఎవరీ బ్యూటీ?

బులుగు జిలుగు దుస్తుల్లో క్వీన్‌ని తలపిస్తోంది.. ఇంతకీ ఎవరీ బ్యూటీ? అంటే .. పరిచయం అవసరం లేదు. పేరు దివి వద్యత. నాగార్జున హోస్ట్ చేసిన బిగ్ బాస్ ఇంటి సభ్యురాలిగా అలరించిన దివి, అటుపై సినీరంగంలో అడుగులు వేసింది. ఇక్కడ వరుసగా క్రేజీ అవకాశాలు అందుకుంటోంది. ఓవైపు వెబ్ సిరీస్ లు మరోవైపు సినిమాలు రెండిటితో బ్యాలెన్స్ డ్ గా కెరీర్ బండిని నడిపించేస్తోంది. నేటితరంలో అందానికి అందం.. ప్రతిభ, అంతకుమించి సోషల్ మీడియాల్లో ఫాలోయింగ్ తో దివి వద్యత దూసుకెళుతోంది. ముఖ్యంగా దివి సోషల్ మీడియా ఫోటోషూట్లకు భారీ ఫాలోయింగ్ ఏర్పడింది. తాజాగా దివి షేర్ చేసిన ఓ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. దివి తన టోన్డ్ లెగ్స్ సౌందర్యాన్ని ఆవిష్కరిస్తున్న ఈ నీలిరంగు ఫ్రాక్ కుర్రకారు గుండెల్లో గుబులు రేపుతోంది. దివి ఒక అందమైన విల్లా పరిసరాల్లో పచ్చందాల



నడుమ అలా హొయలు పోయిన ఫోటోలు షేక్ చేస్తున్నాయి. రకరకాల భంగిమల్లో ఈ బ్యూటీ కెమెరాకు ఫోజులిచ్చింది. స్వగతం విషయానికి వస్తే.. వయసు 26. హైదరాబాద్ స్వస్థలం. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ లో పాఠశాల విద్యను అభ్యసించింది. MBA స్టడీస్ కోసం G. నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ (మహిళా కాలేజ్)లో చేరారు. శశికాంత్ వద్యత .. దేవకి వద్యత దంపతుల కుమార్తె. ఆమెకు కిషోర్ వడ్యా అనే అన్నయ్య ఉన్నాడు. 2017లో స్థానిక బ్రాండ్‌ల కోసం ప్రింట్ షూట్‌లు చేయడం ద్వారా దివి వద్యత మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఆ తర్వాత పలు ఫ్యాషన్ షోల కోసం ర్యాంప్‌పై నడిచింది. 24 జనవరి 2018న దివి తన యూట్యూబ్ ఛానెల్ "టింగరబుచ్చి"ని ప్రారంభించింది. దివి 2018లో "లెట్స్ గో" అనే తెలుగు చిత్రంతో తన నటనను ప్రారంభించింది. ఆ తర్వాత తెలుగులో మహేష్ సినిమా "మహర్షి" సినిమాలో కనిపించింది. సీన్ నంబర్ 72 చిత్రం సహా పలు తెలుగు చిత్రాల్లో కనిపించింది. 2020లో బిగ్ బాస్ తెలుగు 4 ఇంట్లోకి పోటీదారుగా ఆదరణ దక్కించుకుంది. పాడటం, నృత్యం, పెయింటింగ్, ప్రయాణాలు దివి హాబీస్. హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషలపై దివికి మంచి పట్టు ఉంది.




# కర్ణాటక సీఎం వైరల్ వీడియోపై కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్: "ఎన్నికల్లో ఓట్ల కోసం ఎన్నో హామీలు ఇస్తాం.. అంత మాత్రాన ఫ్రీగా ఇవ్వాలా? మాకు ఇవ్వాలనే ఉంది. అయితే డబ్బులు లేవు" అని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అసెంబ్లీలో మాట్లాడారంటూ ఓ వీడియో వైరల్ అవుతోంది. దీనిపై భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఆ వీడియోను రీపోస్ట్ చేస్తూ.. కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. "ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడానికి డబ్బులు లేవని సిద్దరామయ్య అంటున్నారు. అలా హామీల ప్రకటన ఇచ్చే ముందు ఆలోచన చేయరా? తెలంగాణ భవిష్యత్తు కూడా ఇలాగే ఉంటుందా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. కాగా సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారాన్ని కర్ణాటక సీఎం ఖండించారు. "భాజపా నేతలు అశ్వత్ నారాయణ, సి.టి.రవి దుష్ప్రచారం చేస్తున్నారు. నా వ్యాఖ్యలు వక్రీకరించి ఎడిట్ చేసిన వీడియో ప్రసారం చేస్తున్నారు.

ఎన్నికల హామీల అమలులో అసమర్థతను అంగీకరించినట్లు దుష్ప్రచారం చేస్తున్నారు. 2018లో హామీలు నెరవేర్చడంలో భాజపా విఫలమైంది" అని సిద్దరామాయ్య వ్యాఖ్యానించారు.

# కరోనా వేరియంట్ భయం.. గాంధీ ఆసుపత్రి రాజారాం కీలక వ్యాఖ్యలు



కరోనా మళ్లీ కలవరపెడుతోంది. రూపం మార్చుకుని మళ్లీ వచ్చేస్తోంది. కరోనా కొత్త వేరియంట్ %జీచీ%.1 విజృభిస్తోంది. రెండురోజులుగా కొత్త వేరియంట్ తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఏకంగా మళ్లీ కరోనా మరణాలను గుర్తుచేస్తోంది. అసలు జెఎన్%--%వన్ వేరియంట్ ఏంటీ? దాని లక్షణాలు ఎలా ఉంటాయి? కొత్త వెరియంట్ ఎంత వరకు ప్రమాదకరం.. దేశంలో కోవిడ్ కేసుల సంఖ్య మళ్ళీ పెరుగుతోంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కరోనా కొత్త వేరియంట్ బారినపడి ఆరుగురు మృతి చెందారు. ఈ తాజా పరిణామాలు ప్రజలను మళ్లీ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కరోనా కేసుల పెరుగుదల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై రాష్ట్రాలకు కీలక సూచనలు జారీ చేసింది. రెండేళ్ల క్రితం దేశంలో ఒమిక్రాన్ వెరియంట్ వేగంగా విస్తరించింది. చాలా మందిని ఇబ్బందిని పెట్టింది. అనారోగ్యానికి గురిచేసి అవస్థల పాలు చేసింది. తాజాగా ఈ వేరియంట్ నుంచి పుట్టుకొచ్చిన సబ్ వెరియంటే %జీచీ%-1. ఒమిక్రాన్ రూపం మార్చుకుని జెఎన్-1 గా ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ వేరియంట్‌లో జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి లక్షణాలు ఉంటాయి. కొంతమందిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తనున్నట్లు వైద్య అధికారులు చెబుతున్నారు. కేసులు పెరిగితే మళ్లీ టెస్టులు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. రాబోయే పండుగల సీజన్ల దృష్ట్యా ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని, మాస్కులను ధరించాలని ప్రజలను కోరుతున్నారు. మరోవైపు.. కరోనా కొత్త వేరియంట్ కేసులతో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. కరోనా చికిత్సలకు నోడల్ కేంద్రంగా ఉన్న గాంధీ ఆస్పత్రి సిబ్బంది కూడా అప్రమత్తమై.. కొవిడ్ కేసుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎప్పుడు రోగులు వచ్చినా చికిత్సలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. ప్రత్యేకంగా కరోనా వార్డ్‌లో బెడ్స్‌ను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఇక, క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల, సంక్రాంతి పండుగ సందర్భంలో కొత్త వేరియంట్ కట్టడి సవాల్‌గా మారనుంది. సో.. బీ కేర్ ఫుల్.. బీ అలెర్ట్.

# స్పీడ్ పెంచిన సీఎం రేవంత్.. ఇక జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ వంతు..



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పీడ్ పెంచింది. ఇప్పటికే పలు శాఖలపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సమీక్షలు నిర్వహించారు. ఇక, తాజాగా కొత్త ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌పై ఫోకస్ పెట్టింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏపై సమీక్ష చేపట్టనుంది. అయితే, గ్రేటర్ హైదరాబాద్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నెల 25వ తేదీ తరువాత జీహెచ్ఎంసీ-హెచ్ఎండీఏపై కాంగ్రెస్ ప్రభుత్వం సమీక్ష చేపట్టనుంది.

ఈ మేరకు జీహెచ్ఎంసీ-హెచ్ఎండీఏ పరిధిలో రిపోర్టు తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రాపర్టీ ట్యాక్స్, పెండింగ్ పనుల లిస్ట్‌పై బల్దియా కసరత్తు మొదలు పెట్టింది. ఇక, హెచ్ఎండీఏ పరిధిలో ఓఆర్ఆర్ టెండర్లు, భూముల వేలంతో పాటు పెండింగ్ పనుల లిస్ట్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు, ఆదాయ మార్గాల్లో భాగంగా రెండింటిపై ప్రభుత్వం సమీక్ష చేపట్టనుంది. ఇదిలా ఉండగా.. సీఎం రేవంత్ రెడ్డి వద్దే మున్సిపల్ శాఖ ఉన్న విషయం తెలిసిందే.

# నిజామాబాద్ హత్యల కేసు: కీలక విషయాలు వెల్లడించిన ఎస్పీ



నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాలో ఒకే ఇంట్లో ఆరుగురు హత్య కేసులో ప్రధాన నిందితుడు ప్రశాంత్‌తో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఆమె మంగళవారం కేసు సంబంధించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. ఒక్కొక్కరినీ ఒక్కో ప్రాంతానికి తీసకువెళ్లి హత్య చేశారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్‌లలో కేసు నమోదైనట్లు తెలిపారు. ప్రశాంత్‌తో పాటు గుగులోతు విష్ణు, బానోతు వంశీ, వడ్డమ్మ, మరో మైనర్ బాలుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నవంబర్ 29 రోజు ప్రసాద్‌ను రాళ్లతో కొట్టి చంపి పూడ్చిపెట్టారని నిందితులను విచారిస్తే తెలిసిందన్నారు. ఈ హత్యలు చేయడానికి వాడిన టాటా ఆల్ట్రోజ్ కారు, భూమి పత్రాలు, రూ.30 వేలు, ఐదు సెల్ ఫోన్లు దొరికినట్లు చెప్పారు. ఆ ఫోన్లు కూడా మృతి చెందినవారివిగా గుర్తించామని అ?న్నారు. వారి ప్రణాళిక ప్రకారం ప్రసాద్ వాళ్ల అమ్మను కూడా హత్య చేయాలనుకున్నారని తెలిపారు.

ఈ ఆరుగురి హత్యల్లో నిందితుడు ప్రశాంత్ తల్లి పాత్ర కూడా ఉన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. పలు అనుమానాల ఆధారంగా ఇది కేవలం ప్రథమిక విచారణ అన్నారు. ఈ కేసులో అన్నివైపుల నుంచి లోతుగా తదుపరి దర్యాప్తు కొనస్తామని తెలిపారు.

# హైకోర్టును ఆశ్రయించిన మల్లారెడ్డి

హైదరాబాద్: భూ కబ్జా ఆరోపణలపై మాజీ మంత్రి మల్లారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనపై శామీర్‌పేట్‌లో నమోదైన కేసును క్వాష్ చేయాలని హైకోర్టును మల్లారెడ్డి కోరారు. గత వారం క్రితం మల్లారెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. 47 ఎకరాల భూమిని కబ్జా చేసిన ఆరోపణపై మల్లారెడ్డితో పాటు 9 మందిపై కేసు నమోదు అయ్యింది. తనను రాజకీయ కక్ష సాధింపుతోనే ఇరికించారని మాజీమంత్రి పిటిషన్‌లో పేర్కొన్నారు. మల్లారెడ్డి పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరుగనుంది.



# పార్లమెంట్ ఆవరణలో ఆసక్తికర సన్నివేశం.. కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ ఎంపీ

దిల్లీ: లోక్‌సభలో దుండగుల చొరబాటు ఘటన పార్లమెంట్ సమావేశాలకు మరోసారి అంతరాయం కలిగించింది. దీనిపై కేంద్ర హోం మంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుపట్టారు. ఈ క్రమంలో సభాపతి ఆదేశాలు ధిక్కరించినందుకు మరో 49 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మూజువాణీ ఓటుతో లోక్‌సభ ఆమోదించింది. ఈ క్రమంలో పార్లమెంట్ ఆవరణలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు చెప్పారు. కేరళలోని జాతీయ రహదారి-66 నిర్మాణం పూర్తి చేసినందుకు గడ్కరీకి థరూర్ ధన్యవాదాలు చెబుతూ ఆయనతో ఉన్న ఫొటోను ఎక్స్‌లో షేర్ చేశారు. "లోక్‌సభ సమావేశాల సందర్భంగా ఈ అవకాశం నాకు లభించింది. కాళకుటం నుంచి కరోడ్ వరకు ఎన్‌హెచ్-66 నిర్మాణం పూర్తి చేసినందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు. భవిష్యత్తులో తిరువనంతపురం నుంచి కన్యాకుమారి వరకు నాలుగు లైన్ల రహదారికి ఇది అనుసంధానం అవుతుంది. ఈ రహదారి అభివృద్ధి పనులను నేనే ప్రారంభించాను. నియోజవర్గ ప్రజల అభ్యర్థన మేరకు ఓవర్‌పాస్‌లు, ట్రాఫిక్ లైట్లు, మెరుగైన అనుసంధానం కోసం కేంద్ర మంత్రిని కలవడం జరిగింది. ఆయన సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ధన్యవాదాలు నితిన్ గడ్కరీజీ" అని థరూర్ ట్వీట్ చేశారు. పార్లమెంట్‌లో మంగళవారం సస్పెన్షన్‌కు గురైన 49 మంది ఎంపీల్లో శశి థరూర్ కూడా ఉన్నారు.




# మహిళలకు ఫ్రీ జర్నీ స్కీమ్ ఎత్తేయాలి.. బస్ భవన్ ముట్టడికి ఆటో కార్మికుల యత్నం

హైదరాబాద్: బస్సు భవన్ ముట్టడికి మంగళవారం ఉదయం భారతీయ మజ్దూర్ సింఘ్(బీఎంఎస్) ఆటో కార్మికులు యత్నించారు. పలు డిమాండ్ల సాధనతో నిరసన ప్రదర్శన చేపట్టారు వాళ్లు. ఈ క్రమంలో బస్‌భవన్ వైపు దూసుకెళ్లే యత్నం చేయగా.. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది అక్కడ. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో.. తమ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం మహిళలకు ఉచిత ప్రయాణ పథకం తీసుకొచ్చింది. ఈ క్రమంలో పథకానికి వ్యతిరేకంగా పలు జిల్లాల్లోనూ నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి.

మహాలక్ష్మి పథకంలో భాగంగా ఫ్రీ జర్నీ స్కీమ్‌ను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేయాలని, అలాగే తమ ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు వాళ్లు. అలాగే.. ఓలా, ఉబర్ రాపిడోలతో ఇబ్బందులు పడుతున్నామని.. వాటిని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు ఆటో కార్మికులు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ తీరు పట్ల అనుమానాలున్నాయ్..



హైదరాబాద్: కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కాగ్ నివేదిక అడిగిందని.. మార్చ్ 2023లోనే కాగ్ లేఖ పంపిందని బీజేపీ నేత రఘునందనరావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తమ బండారం ఎక్కడ బయట పడుతుందో అని భయపడి దీన్ని రాష్ట్ర ప్రభుత్వం దాచి పెట్టిందన్నారు. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు పట్ల తమకు అనుమానాలున్నాయన్నారు. దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కాం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిందన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీబీఐ ఎంక్వైరీ చేయాలని అమిత్ షాకు లేఖ రాశారని.. ఇప్పుడెందుకు కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణకు రేవంత్ లేఖ రాయట్లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం అంటే కేవలం మేడిగడ్డ కాదని.. అది ప్రాజెక్ట్‌లో చిన్న భాగమే అని అన్నారు. కాళేశ్వరం పక్కన పెట్టేసి మెడిగడ్డ వరకే చర్చ సాగుతోందన్నారు. ప్రాజెక్ట్ కృంగినప్పుడు మేడిగడ్డ సందర్శనకు వెళ్లిన రాహుల్ గాంధీ కాళేశ్వరం సొమ్మును రికవరీ చేసి .. ప్రజల ఖాతాలో వేస్తామని చెప్పిన మాటేమిటని ప్రశ్నించారు. స్కాం వెనకాల మేఘ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఉందని ఆరోపించారు. ఎల్ అండ్ టీ వరకే కాళేశ్వరం స్కాం పరిమితం చేయాలని చూస్తున్నారన్నారు. మేఘ కంపెనీకి కర్ణాటకలో కొన్ని ప్రాజెక్ట్స్ దక్కాయన్నారు. అక్కడ ప్రభుత్వంలో ఉన్న ఓ ప్రజాప్రతినిధిని మేఘా పెద్దలు కలిసినట్టు సమాచారం ఉందన్నారు.

దీంతో మేఘ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అనుమానం కలుగుతోందన్నారు. హైకోర్ట్ జడ్జి విచారణ అనేది కేసును పక్క దారి పాటించడానికి మాత్రమే అని.. దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. మేఘ కరప్షన్ మీద సీబీఐ విచారణకు ఆదేశించాలని రేవంత్ కేంద్రాన్ని కోరాలన్నారు. దానికి సంబంధించిన ఆధారాలు కావాలంటే తాను ఇస్తాను అని బీజేపీ నేత రఘునందనరావు వెల్లడించారు.

# ప్రజావాణి కార్యక్రమం చాలా బాగా జరుగుతోంది

హైదరాబాద్: ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమం చాలా బాగా జరుగుతోందన్నారు. ఈరోజు 5126 దరఖాస్తులు వచ్చాయని.. వీటిలో చాలా మంది సొంత ఇల్లు లేదని వచ్చారన్నారు.

నిరుద్యోగులు కూడా ఎక్కువ సంఖ్యలో వచ్చారని తెలిపారు. వాళ్ల సమస్యలు ఖచ్చితంగా పరిష్కారం చేస్తామని స్పష్టం చేశారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఆటో వాళ్ళు ఇబ్బంది పడుతున్నారని.. ఆ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆటో వాళ్ళు తమ సోదరులే అని... వాళ్ళకు ఖచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. ఆటో వారి విషయంలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని.. అప్పటి వరకు కొంచెం ఓపికగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.




# తెలంగాణ ప్రభుత్వంతో జూడాల చర్చలు సఫలం

హైదరాబాద్: జూనియర్ డాక్టర్లతో మంగళవారం తెలంగాణ ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించాయి. సర్కార్ హామీతో జూడాలు వెనక్కి తగ్గారు. ప్రభుత్వం తమ డిమాండ్లకు సానుకూలంగా స్పందించిందని, సమ్మె నిర్ణయంపై త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామని జూడా ప్రతినిధులు మీడియాకు తెలిపారు. టైం టు టైం స్టైఫండ్ రిలీజ్‌తో పాటు పలు డిమాండ్లతో సమ్మెకు వెళ్లాలని జూనియర్ డాక్టర్లు భావించారు. ప్రభుత్వానికి అల్టిమేటం కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వాళ్లను చర్చలకు ఆహ్వానించింది. వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహ వాళ్లతో చర్చించారు. డిమాండ్లకు ఆయన సానుకూలంగా స్పందించడంతో జూడాలు వెనక్కి తగ్గారు. స్టైఫండ్ కోసం గ్రీన్‌ఛానెల్ ఏర్పాటుతోపాటు ప్రతి నెలా 15వ తేదీ లోపు స్టైఫండ్ విడుదలయ్యేలా చూస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ ఈ సందర్భంగా జూడాలకు హామీ ఇచ్చారు. అలాగే హాస్టల్స్ వసతులతో పాటు కొత్త హాస్టల్స్ ఏర్పాటును పరిశీలిస్తామని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం నిర్మిస్తామని జూడాలతో మంత్రి చెప్పారు. అంతేకాదు.. జాతీయ వైద్య మండలి నిబంధనల ప్రకారమే అన్ని వసతులు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని జూడాల ప్రతినిధులు తెలిపారు. సమ్మె నిర్ణయంపై జూనియర్ డాక్టర్లతో చర్చించి వీలైనంత త్వరగా తమ నిర్ణయం ప్రకటిస్తామన్నారు.




# కాళేశ్వరం పిటిషన్: రెండు వారాలకు విచారణ వాయిదా




హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు రెండు వారాలకు విచారణ వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని పిటిషన్ దాఖలైంది. టీపీసీసీ ఎలక్షన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ నిరంజన్ ఈ పిటిషన్ వేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపురం పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసును సీబీఐకి బదిలీ చేయాలని పిటిషన్‌లో కోరారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన అంశంపై పిటిషనర్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగిన ఘటన జరిగిన సమయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి పలు ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదులను అనుసరించి రాష్ట్ర సీఎస్‌కు లేఖ రాసిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటి. సీఎస్ నుండి సమాచారం తీసుకుని రెండు వారాల్లోపు పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసిన హైకోర్టు వెల్లడించింది.

# సమాధానం కోరితే.. సస్పెన్షనా..? కేంద్రం తీరును ఖండించిన విపక్షాలు

దిల్లీ: గతవారం పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై కేంద్రహోం మంత్రి ప్రకటన చేయాలంటూ విపక్షాలు నిరసనలు కొనసాగించడంతో.. భారీ సంఖ్యలో విపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటుపడింది. తాజాగా ఆ సంఖ్య 140కు చేరింది. ఈ చర్యను విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. సభల్లో అర్థవంతమైన చర్చలేకుండా చట్టాలు ఆమోదించుకునేందుకే ఈ సస్పెన్షన్ అని మంగళవారం కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాగే ఎన్‌సీపీ అధినేత, రాజ్యసభ ఎంపీ శరద్ పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు లేఖ రాశారు.

సభల్లో అర్థవంతమైన చర్చలేకుండా చట్టాలు ఆమోదించుకునేందుకు కేంద్రప్రభుత్వం విపక్షం మొత్తాన్ని ఖాళీ చేయించింది. దీంతో ఇద్దరు దుండగులు ప్రవేశించేందుకు పాస్‌లు ఇచ్చిన ఎంపీ నిర్దోషిగా మారారు.. **కాంగ్రెస్**

భద్రతా ఉల్లంఘన అంశాన్ని చర్చించకపోవడం బాధాకరం. ఎంపీలను కాపాడడానికి బదులుగా వాళ్లను సస్పెండ్ చేస్తున్నారు.. **కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**

భద్రతా వైఫల్యం ఘటనపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసిన సభ్యులపై సస్పెన్షన్ వేటు విధించడం.. పారదర్శకత, జవాబుదారీ సూత్రాలకు విరుద్ధం. పార్లమెంట్ భద్రతకు సంబంధించి వివరణ కోరే హక్కు సభ్యులకు ఉంటుంది. జరిగిన ఘటన ఎంత తీవ్రమైందో సభ్యుల నిరసనలు వెల్లడిచేస్తున్నాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు చేపడుతుందో ప్రభుత్వం ఒక ప్రకటన ద్వారా తెలియజేయాలి. కానీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది.. **శరద్ పవార్**

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com